


www.vibharenews.com

# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 03-02-2023 సంపుటి : 04 సంచిక : 141 పేజీలు : 4 వెల : రూ 3-00


## 'అదానీ - హిండెన్‌బర్గ్'పై పార్లమెంట్‌లో రగడ..

### ఉభయ సభలు రేపటికి వాయిదా

దిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు గందరగోళంగా మారాయి. అదానీ గ్రూప్ ఎహిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక వ్యవహారంపై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి.పభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టాయి. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.బడ్జెట్ (ఃబీటణవబి 2023) సమావేశాల్లో భాగంగా పార్లమెంట్ ఉభయ సభలు గురువారం సమావేశమయ్యాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ (ఒనీని ాజీఎష్ట్రజీ) ప్రారంభమైన తర్వాత స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల



గంటను మొదలుపెట్టారు. అయితే అదానీపై హిండెన్‌బర్గ్ నివేదిక గురించి చర్చించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు ఈ విషయంపై వాయిదా తీర్మానాలు ఇచ్చాయి. అయితే, ఇందుకు సభాపతి అంగీకరించలేదు. ప్రశ్నోత్తరాల గంట చాలా ముఖ్యమైందని, సభ్యులు అంతరాయం కలిగించొద్దని కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు వెనక్కి తగ్గకపోవడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అటు రాజ్యసభ (ఖీజీతీఎజీ ాజీఎష్ట్రజీ)లోనూ ఇదే పరిస్థితి కన్పించింది. ఉదయం 11 గంటలకు ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభను ప్రారంభించగానే విపక్ష సభ్యులు ఆందోళన లేవనెత్తారు. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఉభయ సభలు తిరిగి ప్రారంభమవ్వగా.. పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. వాయిదా తీర్మానాలపై చర్చ జరపాల్సిందేనని ప్రతిపక్ష ఎంపీలు గట్టిగా నినాదాలు చేశారు. ఆందోళనల నేపథ్యంలో సభలను శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు.అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై దర్యాప్తు చేపట్టాల్సిందేనని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఉభయ సభలు వాయిదా పడిన అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో కలిసి విపక్ష నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. "ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) లేదా సీజేఐ ఆధ్వర్యంలోని కమిటీతో దర్యాప్తు జరిపించాలి. ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కోట్లాది మంది ప్రజల పెట్టుబడులున్నాయి. వారి సొమ్ము ఇప్పుడు ప్రమాదంలో పడింది" అని విపక్షాలు ఆరోపించాయి.హిండెన్‌బర్గ్ నివేదికతో వివాదం కొనసాగుతున్న వేళ.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.20వేల కోట్ల మలివిడత పబ్లిక్ ఆఫర్‌ను వెనక్కి తీసుకుంది.

## కోటంరెడ్డిని తప్పించి.. నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డికి బాధ్యతలు

తాడేపల్లి: నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జిగా అదాల ప్రభాకర్ రెడ్డి అధిష్ఠానం నియమించింది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారంటూ అధిష్టానంపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో వైకాపా అగ్రనాయకత్వం రూరల్ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి ఆయన్ను తప్పించింది.నేతల మధ్య విభేదాలు, పరిష్కారం, తీసుకోవాల్సిన చర్యలపై సీఎం దిశానిర్దేశం చేశారు. వాలంటీర్ల కార్యదర్శుల నియామకంపై కూడా భేటీలో చర్చించారు. 26 జిల్లాల పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్లతో పాటు మంత్రి బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

త్వరలో ఎమ్మెల్యే కోటంరెడ్డిపై చర్యలు: బాలినేని

సమావేశం ముగిసిన తర్వాత బాలినేని మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఫోన్ కాల్‌ను ఆయన స్నేహితుడే రికార్డింగ్ చేశారని తెలిపారు. కోటంరెడ్డిపై చర్యలకు సంబంధించి త్వరలో చర్చించి నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు ఎమ్మెల్యేలు ఆనం, కోటంరెడ్డి నిరూపించాలని సవాల్ విసిరారు. రెండేళ్లుగా ఫోన్ ట్యాపింగ్ అంటూ ఇప్పుడే ఎందుకు చెప్పారని నిలదీశారు. వెళ్లే ముందు ఏదో ఒక విమర్శలు చేసి పోతున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. కోటంరెడ్డి స్నేహితుడే ఫోన్ కాల్ రికార్డ్ చేశారని తెలిపారు. "ఫోన్ రికార్డింగ్ చేసి ట్యాపింగ్ అంటున్నారు. కోటంరెడ్డి స్నేహితుడు రామశివారెడ్డి వచ్చి అన్నీ చెబుతారు.



డిసెంబరు 25న చంద్రబాబుతో కోటంరెడ్డి మాట్లాడినట్టు తెదేపా నేతలు చెబుతున్నారు. లోకేశ్‌తో కోటంరెడ్డి ఫోన్‌లో మాట్లాడారని తెలుస్తోంది. కోటంరెడ్డిని సీఎం నమ్మితే ఆయన నమ్మక ద్రోహం చేశారు" అని పేర్ని నాని అన్నారు.

ఎంపీ ఆదాలకు కొత్త బాధ్యతలు..

నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జిగా ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిని అధిష్ఠానం నియమించింది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారంటూ అధిష్ఠానంపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో వైకాపా అగ్రనాయకత్వం రూరల్ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి ఆయన్ను తప్పించింది. ఇన్‌ఛార్జి నియామకం కోసం పలువురు పేర్లను అధిష్ఠానం పరిశీలించినప్పటికీ.. చివరకు ఆదాల ప్రభాకర్ రెడ్డి పేరును ఖరారు చేసింది. దీంతో నెల్లూరు నగరంలోని ఆదాల నివాసం వద్ద వైకాపా కార్యకర్తల సందడి నెలకొంది.

## ఏపీ రాజధానిగా విశాఖ

### ఉగాదికి ముహూర్తం

అమరావతి : ఏపీ రాజధానిగా విశాఖపట్నం ఖాయమని రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు అంటున్నారు. అక్కడ పాలన సాగించడానికి అవసరమైన అన్ని వసతులు అక్కడ ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఉగాది నుంచి విశాఖ కేంద్రంగా పాలన సాగుతుందని తెలిపారు. రాజ్యాంగంలో రాజధాని అనే పదం ఎక్కడా ఉండదు. ముఖ్యమంత్రి ఎక్కడుంటే.. అక్కడే ఆఫీస్ అని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రితో పాటు రాజధాని కూడా విశాఖకు మారుతుంది అని మంత్రి గుడివాడ



అమర్నాథ్ సీఎం ఎక్కడుండి పరిపాలిస్తే అదే రాజధాని అని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు.'రాజ్యాంగంలో రాజధాని అనే పదం ఎక్కడా ఉండదు. ద హెడ్ ఆఫ్ ద స్టేట్ ఎక్కడుంటారో అక్కడే ఆఫీస్. ముఖ్యమంత్రి ఎక్కడుంటే అక్కడే ఆఫీస్. ముఖ్యమంత్రి ఎక్కడ నిర్ణయం తీసుకుంటే అదే ఆఫీస్ అని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు.ఉగాది నుంచే విశాఖ కేంద్రంగా పరిపాలన సాగనుందని ప్రభుత్వ చీఫ్విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. అదేరోజు విశాఖ రాజధానిగా సీఎం ప్రకటించనున్నారని ఆయన తెలిపారు.విశాఖ నుంచి పాలన సాగించడానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. రాజధానిని విశాఖకు తరలించడం ఖాయమని, అదే విషయం సీఎం జగన్ మరోసారి చెప్పారని వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు కొడాలి నాని, పేర్ని నాని తెలిపారు. సుప్రీంతీర్పు తమకు అనుకూలంగా వస్తుందని, ఒకవేళ రాకున్నా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్లో మూడు రాజధానుల బిల్లు పెట్టిస్తామని కొడాలినాని వివరించారు. మూడు రాజధానుల ఏర్పాటే ప్రభుత్వ సంకల్పమని పేర్నినాని అన్నారు.'కొత్త బిల్లు తీసుకుని వస్తాం. ముఖ్యమంత్రి అనే వారు ఈ రాష్ట్రానికి రాజులాంటి వాడు. ఆయన పరిపాలన ఎక్కడి నుంచి చేస్తే అదే రాజధాని. ముఖ్యమంత్రితో పాటు రాజధాని కూడా వస్తుందని మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు గవర్నర్ కు ఆహ్వానం



విజయవాడ : శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ మాననీయ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ కు దేవస్థానం ప్రతినిధులు ఆహ్వానం అందించారు. ఇల కైలాసంగా ప్రసిద్ధినొంది, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకరైన శ్రీ మల్లికార్జున స్వామి వారికి, అష్టాదశ మహాశక్తి స్వరూపాలలో ఒకరైన శ్రీ భ్రమరాంబాదేశి వారికి నిలయమైన ఈ దివ్య క్షేత్రంలో ఈనెల 11వ తేదీ నుండి 21వ తేదీ వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణి రెడ్డి, కార్యనిర్వహణ అధికారి లవన్న గవర్నర్ కు వివరించారు. 18వ తేదీన మహాశివరాత్రి వర్వదినం సందర్భంగా స్వామివారికి లింగోద్భవకాల మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం , పాగాలంకరణ, కళ్యాణ మహోత్సవం ఉంటాయని కుటుంబ సమేతంగా వేడుకకు హాజరు కావాలని విన్నవించారు. 19వ తేదీన స్వామివారి రథోత్సవం, తప్పోత్సవం నిర్వహిస్తామని, పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసామని గవర్నర్ హరిచందన్ కు తెలిపారు.

## పోలవరంపై ఎంపీ వంగా గీత ప్రశ్న.. కేంద్రమంత్రి సమాధానమిదే

న్యూఢిల్లీ: పోలవరంపై లోక్‌సభలో వంగా గీత ప్రశ్నకు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానమిచ్చారు. "భూసేకరణ పరిహారాన్ని నిర్వాసితుల ఖాతాలో వేయాలని రాష్ట్రం కోరింది.రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలపలేదు" అని గజేంద్రసింగ్ తెలిపారు."భూసేకరణ కింద 3,779 కోట్ల రూపాయల బిల్లులు రీయింబర్స్‌మెంట్ కోసం రాష్ట్రం సబ్మిట్ చేసింది. అందులో 3,431.59 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం



రీయింబర్స్‌మెంట్ చేసింది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద 2,267 కోట్ల రూపాయల బిల్లులను రీయింబర్స్‌మెంట్ కోసం పంపారు. అందులో 2,110 కోట్ల రూపాయల బిల్లులకు చేశాం. పిఐఏ, సీడబ్ల్యూ సిఫారసుల ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులను వెరిఫై చేసి చెల్లిస్తున్నాం" అని లోక్‌సభలో గజేంద్రసింగ్ వెల్లడించారు.

## కేంద్రబడ్జెట్ ఆంధ్రప్రదేశ్ కు మేలు చేసే బడ్జెట్

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీసోమువీర్రాజు

అమరావతి :పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలకు అనుగుణంగా కేంద్రబడ్జెట్ ఉంది. సమాజంలోని చిట్టచివరి వ్యక్తి వరకు బడ్జెట్ ఫలాలు అందేవిధంగా ఉండడం హర్షనీయమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు అన్నారు.ప్రతిపక్షాలు బడ్జెట్ ని విమర్శించాలని విమర్శించడమేకాని వారికి కూడా ఇది మంచి బడ్జెట్ గా వారికీ అభిప్రాయం ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంతటి మంచి బడ్జెట్ చూడలేదన్నారు. సహకారవ్యవస్థనుబలోపేతం చేయడానికి బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు ఏడు అంశాలు ఆధారంగా బడ్జెట్ రూపకల్పన చేయడమే కాదు ప్రతి పంచాయితీ పరిధిలోను విద్యార్ధులకు డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయడం. ప్రతి రాష్ట్రానికి వడ్డీలేని రుణాలు అవకాశం కల్పించడం ద్వారా కేంద్రం ఫెడరల్ స్ఫూర్తి కనపడుతోంది. శాఖల వారీగా ఉన్న బడ్జెట్ ని విమర్శించడం అంటే ప్రతిపక్షాల సంకుచిత బుద్దికనఎడుతోంది.స్వయంసహకార సంఘాలకు నిధులు కేటాయింపుతో పాటు వ్యవసాయ రంగానికి కూడా స్పష్టంగా నిధులు కేటాయించడం ఇది రైతు ప్రభుత్వంగా చెప్పుకోవాలి. రైల్వేలు, రహదారులకు పెద్ద పీట వేయడం ద్వారా దేశంలో రవాణా వ్యవస్థను ఆధునీకరించడం ద్వారా అన్నిరంగాలకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. ప్రతి శాఖలో ను పారదర్శకత పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విద్య,వైద్యరంగాలకు కూడా బడ్జెట్ లో కేటాయింపులు ఉండడం హర్షనీయమన్నారు. అమ్రుత కాల బడ్జెట్ ద్వారా భవిష్యత్ తరాలకు మంచి ఊతమిస్తున్న బడ్జెట్ గా పేర్కొన్నారు. మిల్లెట్స్ ఉత్పత్తికి భారత్ కేంద్రంగా మార్చడానికి



కేంద్రం చేస్తున్న చొరవకు బడ్జెట్ ఊతమిస్తోందన్నారు.గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్యపాఠశాలలకు ఉపాధ్యాయ నియమాకాలు సైతం బడ్జెట్ లో వెసులు బాటు కల్పించడంతో పాటు యువతకు అవసరమైన రంగాలకు కూడా నేరుగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. అదేవిధంగా కోస్తా తీరం వెంబడి మడఅడవులు పెంపకంతో పాటు మత్స్యశాఖ కు కూడా ప్రత్యేక కేటాయింపులు ఉండడంద్వారా ఆంధ్రప్రదేశ్ కు మేలు చేసే బడ్జెట్ గా సోమువీర్రాజు పేర్కొన్నారుబిజెపి రాష్ట్ర కార్యాలయం నుండి ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ సోమువీర్రాజు బడ్జెట్ పై ఒక ప్రకటన విడుదల చేశారు

## చంద్రబాబు అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలి: అంజాద్ భాషా

తాడేపల్లి: లోకేష్‌కు పాదయాత్ర చేయడానికి ఏ అర్హత ఉందని డిప్యూటీ సీఎం అంజాద్ భాషా ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓడిపోయి దొడ్డిదారిన లోకేష్ మంత్రి అయ్యాడని దుయ్యబట్టారు."చంద్రబాబు అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలి. మైనార్టీలకు సీఎం జగన్ పెద్దపీట వేశారు. విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుబడిన



మైనార్టీలకు సీఎం జగన్ అండగా నిలిచారు" అని మంత్రి అన్నారు." వైఎస్సార్సీపీతోనే మైనార్టీలకు ఆత్మగౌరవం. త్వరలోనే లక్ష మంది మైనార్టీలతో బహి రంగ సభ నిర్వహిస్తాం. మైనార్టీలు డాక్టర్లు, ఇంజనీర్లు, ఉన్నత విద్య అభ్యసిస్తున్నారంటే దివంగత వైఎస్సార్ ప్రవేశపెట్టిన 4 శాతం రిజర్వేషన్లతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్. తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం జగన్ మైనార్టీలకు రాజకీయంగా కూడా అవకాశాలు కల్పించారు. మైనార్టీలకి డిప్యూటీ సీఎం ఇచ్చారు.. 75 ఏళ్ల చరిత్రలో ఇదే మొదటిసారి. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అని చెప్పే ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్" అని మంత్రి అంజాద్ భాషా పేర్కొన్నారు.

## టీడీపీలో చేరే ఎమ్మెల్యేలు బావిలో దూకినట్టే: మంత్రి పెద్దిరెడ్డి

విజయవాడ: కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి ఆరోపణలపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఫోన్ ట్యాపింగ్ అంటూ అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని నిప్పులు చెరిగారు.చంద్రబాబు కుట్రలో భాగంగా ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేస్తున్నారని, టీడీపీకి వెళ్లాలనుకుంటే వెళ్లవచ్చు.. కాని ఇలాంటి ఆరోపణలు సమంజసం కాదంటూ మంత్రి హితవు పలికారు. సీఎం జగన్ పార్టీ పెట్టకపోతే ఎమ్మెల్యేలు అయ్యేవారా?. ఇలాంటి వారికి సీఎం జగన్ భయపడేవారు కాదు. టీడీపీలో చేరే ఎమ్మెల్యేలు బావిలో దూకినట్టే. ఇలాంటి వాళ్లు వెళ్లినా వచ్చే నష్టమేమీ లేదని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు.



# సంపాదకీయం

శుక్రవారం 03-02-2023

## దేశమంతా గుజరాత్ నినాదమే...

ప్రస్తుతం బీజేపీకి మోడీ వినా మరో ప్రజాకర్షక నేత లేరు. నిజమే ఇప్పుడు మోడీ తప్పితే ప్రస్తుతం బీజేపీలో ఇమేజ్ ఉన్న నేత మరొక్కరు లే రు. అందుకే పార్టీని మించి ఎదిగిన మోడీ పెత్తనాన్ని ఆర్ఎస్ఎస్ అనివార్యంగా భరిస్తోంది. అందుకే 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ నినాదం, ఆశ, అస్త్రం అన్నీ మోడీయే. ప్రచార సారథీ మోడీయే.అందుకే తన కోసం తన కాళ్లకు తానే బలపాలు కట్టుకు మరీ తిరగాల్సిన పరిస్థితి ఇప్పుడు మోడీది. నిజమే కాంగ్రెస్, దేశంలో కొన్ని ప్రాంతీయ పార్టీలూ ఎలా అయితే ఒకే ఒక వ్యక్తిపై ఆధారపడి బండి లాగిస్తున్నాయో.. బీజేపీ కూడా అలాగే మోడీపై ఆధారపడి మనుగడ కొనసాగిస్తోంది. గతంలో కాంగ్రెస్ లో ఈ విధానాన్ని తీవ్రంగా విమర్శించిన బీజేపీ ఇప్పుడు అదే విధానాన్ని అనుసరిస్తున్నది. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం అంతా మోడీ షో అన్నట్లుగానే సాగుదోంది. బీజేపీలో, ప్రభుత్వంలో అంతా తానే అయిన పరిస్థితిపై మోడీ ఇటీవల జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రస్తావించారు. అన్నిటికీ తన ఇమేజ్, తన పేరు ఉపయోగించడంపై ఒకింత అభ్యంతరం చేశారు. అన్నిటికీ తానే రావాలని, తాను వస్తేనే విజయం అన్న మైండ్ సెట్ నుంచి బయటకు రావాలని పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో మోడీ పార్టీ నేతలకు చెప్పారు. అయితే ఆయన ఆ మాట కేవలం మాటవరసకే చెప్పారన్న విషయం అప్పుడే అందరికీ అర్థమైంది. పార్టీకి మోడీ పేరు ఓ తారక మంత్రంగా మారింది. పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం అన్నట్లు బీజేపీ నేతలకు మోడీ జపం వినా మరోటి లేకుండా పోయింది. ఇటీవల జరిగిన హిమాచల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఆ రాష్ట్రానికి చెందిన నేతే ఉన్నా తిరుగుబాటు అభ్యర్థులను బుజ్జగించడానికి స్వయంగా మోడీయే ఫోన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే.. ఆయన ఆధిపత్యం, ప్రాముఖ్యతా పార్టీలో ఎంతగా పాతుకుపోయాయో అర్థం చేసుకోవచ్చు. ఒక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికకు బీజేపీ తిరుగుబాటు అభ్యర్థులను మోడీ తన వ్యక్తిగత హోదాలో అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందంటే.. పార్టీగా బీజేపీ పరిస్థితి ఏమిటో అర్థం అవుతుంది. ఉదాహరణకు హిమాచల్ విషయం చెప్పుకున్నాం కానీ.. దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీ పరిస్థితి ఇలాగే ఉంది.రాష్ట్ర విభాగాలన్నీ మోడీ ఆదేశాల కోసమే ఎదురు చూస్తాయి తప్ప సొంతంగా పని చేసే శక్తియుక్తులను ఎప్పుడో కోల్పోయాయి. అందుకే కాంగ్రెస్ పార్టీకి పోటీగా, దీటుగా రాష్ట్రాల్లో బీజేపీలో కుమ్ములాటలు వర్ధిల్లుతున్నాయి. సంఘ్ పరివార్ నుంచి వచ్చిన పాత బీజేపీ నేతలకు బయటి నుంచి, ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి వచ్చి చేరిన నేతల మధ్య విభేదాలు రోజురోజుకూ పెచ్చరిల్లుతున్నాయి. ఇంతకాలం బీజేపీ జెండా, అజెండా మోసిన తమను కాదని బయటి నుంచి వచ్చిన వారికి పార్టీలో ప్రాధాన్యత పెరగటం, వారికి అధికారం కట్టబెట్టడాన్ని పాతనాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పంటి బిగువన తమ ఆగ్రహాన్ని అణచుకుంటున్నారు.ఒక్కో సారి పార్టీని ధిక్కరించడానికి కూడా వెనుకాడని పరిస్థితులూ ఏర్పడుతున్నాయి. ఇలాంటి సంఘటనలు తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలలో అంతర్గత కుమ్ములాటల రూపంలో బయటకు వస్తూనే ఉంది. వీటి పరిష్కారానికి సైతం మోడీయే రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఉంది.ఇక 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ఇమేజ్ అనే ఏకైక అస్త్రంతో కదన రంగంలోకి అడుగుపెడుతోంది. వరుసగా మూడవసారి అధికారం చేజిక్కించుకుని హ్యాట్రిక్ కొట్టాలన్న పట్టుదలతో మోడీ ఉన్నారు. నెహ్రూ వరుసగా మూడుసార్లు దేశాన్ని ఏలినట్టు తన పేరు కూడా చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోవాలని మోడీ కోరుకుంటున్నారు. అందుకే మోడీ కూడా నెహ్రూ అడుగుజాడలలో అంతర్జాతీయ వేదికలపై గౌరవం పొందడం ద్వారా దేశ ప్రజల మనస్సులలో స్థానాన్ని పదిల పరుచుకోవాలని భావిస్తున్నారు. అందులో భాగమే ఇండియాలో జీ20 శిఖరాగ్ర సదస్సు అని పరిశీలకులు అంటున్నారు.

## ఐ ప్యాక్ సర్వే పేరుతో తెరపైకి గెలుపు గుర్రాలు

విజయవాడ, ఫిబ్రవరి 2, ఆంధ్రప్రదేశ్‌లో ఐ ప్యాక్ సర్వే పేరుతో మళ్లీ గెలుపు గుర్రాల పేర్లు తెరపైకి వచ్చాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలిచే అవకాశం ఉన్న మంత్రులు, మాజీ మంత్రుల పేర్లను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఏడుగురికి మాత్రమే మళ్లీ గెలుపు అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. గత ఏడాది మంత్రి వర్గ విస్తరణలో పదవులు కోల్పోయిన వారిలో ఇద్దరు మాత్రమే తిరిగి అసెంబ్లీలోకి అడుగుపెడతారని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాలను వైఎస్సార్సీపీ వర్గాలు తోసిపుచ్చుతున్నా ప్రజల అభిప్రాయాలకు దగ్గరగా ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.ఏపీలో మళ్లీ గెలిచే అవకాశం ఉన్న మంత్రులు, మాజీ మంత్రుల పేర్లలో కొందరికి మాత్రమే మరోసారి గెలిచే అవకాశం ఉందని కథనాలు వెలువడ్డాయి. 13మంది మాజీ మంత్రుల్లో ధర్మాన కృష్ణదాస్, కొడాలి నానికి మాత్రమే మళ్లీ గెలుస్తారట. 13మందిలో మిగిలిన 11 మంది ఇంటి దారి పట్టాల్సిందేనట. మొత్తం 38 స్థానాల్లో ఏడుగురు ఎమ్మెల్యేలకు మాత్రమే మళ్లీ అసెంబ్లీలో అడుగుపెడతారని ప్రచారం జరుగుతోంది.ప్రస్తుత క్యాబినెట్ మంత్రుల్లో పెద్దిరెడ్డి, నారాయణ స్వామి, అంజాద్ పాషా, పినిపె విశ్వరూప్, దాడిశెట్టి రాజాలు మళ్లీ గెలుస్తారని మిగిలిన మంత్రులంతా ఓడిపోతారని ప్రచారం జరుగుతోంది. సిట్టింగ్ మంత్రుల్లో 20మందికి ఓటమి ఖాయమని ఈ లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుత క్యాబినెట్‌లో మంత్రివర్గ సహచరుల్లో ఐదుగురు మాత్రమే మళ్లీ ఎన్నికల్లో నెగ్గే అవకాశముందని, రాయలసీమ నుంచి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కడప నుంచి అంజాద్ బాషా ,గంగాధర నెల్లూరు నుంచి నారాయణ స్వామి ఉన్నారు. టీడీపీ నుంచి అంత బలమైన అభ్యర్థులు లేకపోవడంతో గెలుపు ఖాయమని అంచనా వేస్తున్నారు.కోస్తా జిల్లాలకు చెందిన ఇద్దరు మంత్రులు మాత్రమే నెగ్గే అవకాశముందని చెబుతున్నారు. ఇద్దరు గోదావరి జిల్లాలకు చెందిన వారు కావడం విశేషం. అమలాపురం ఎమ్మెల్యే పినిపె విశ్వరూప్ , తుని ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా మళ్లీ గెలిచే అవకాశమున్న వారి జాబితాలో ఉన్నారు.ఏపీలో ఐదుగురు మినహా మిగిలిన ఇరవై మంది మంత్రులు ఓడిపోతారని ప్రచారం జరుగుతోంది. వీరిలో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, పీడిక రాజన్న దొర, బూడి ముత్యాల నాయుడు, రోజా, కొట్టు సత్యనారాయణ, ఆదిమూలపు సురేశ్, గుడివాడ అమర్‌నాథ్, కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేశ్, విడదల రజిని, చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ, గుమ్మనూరి జయరాం, కాకాణి గోవర్ధన రెడ్డి, మేరుగు నాగార్జున, అంబటి రాంబాబు, తానేటి వనిత, సీదిరి అప్పలరాజు, ఉషశ్రీ చరణ్ ఉన్నారు. ఓడిపోయే జాబితాలో మాజీ మంత్రులు ఆళ్ల నాని, పుష్ప శ్రీవాణి, మేకతోటి సుచరిత, శంకరనారాయణ, బాలినేని శ్రీనివాస రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, పేర్ని నాని, వెల్లంపల్లి శ్రీనివాస్, అవంతి శ్రీనివాస్, కురసాల కన్నబాబు ఉన్నారు.మరోవైపు వైసీపీ నేతలు మాత్రం ఈ జాబితాను తోసిపుచ్చుతున్నారు.

ఐ ప్యాక్ అంతర్గత సర్వే నివేదికలు సోషల్ మీడియాలో వచ్చే అవకాశం ఉండదని, అత్యంత రహస్యంగా వాటిని రూపొందిస్తారని, ముఖ్యమంత్రి స్థాయిలో కీలకమైన వ్యక్తులకు తప్ప బయటి వారికి అవి లీకయ్యే అవకాశాలు ఉండవని చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి పాలయ్యే వారిని ముందస్తుగా పోటీ నుంచి తప్పించడానికి అనధికారికంగా లీక్ చేసి ఉండొచ్చనే ప్రచారం కూడా జరుగుతోంది. మరోవైపు కీలకమైన వైసీపీ నాయకులు మాత్రం టీడీపీ వ్యూహాల్లో భాగంగానే ఇలాంటి నకిలీ సర్వేలను తెరపైకి తీసుకొస్తున్నారని చెబుతున్నారు. రాష్ట్రంలో చాలా నియోజక వర్గాల్లో పోటీ చేయడానికి కూడా టీడీపీకి అభ్యర్థులు లేరంటున్నారు.

## మిర్చీ వ్యాపారి కిడ్నాప్ కలకలం

గుంటూరు, ఫిబ్రవరి 2,గుంటూరులో మిర్చీ వ్యాపారి కిడ్నాప్ కలకలం రేపింది. మిర్చీ యార్డు నుంచి బైక్ పై వస్తున్న వ్యాపారిని చితకబాది ఇన్నోవా కారులో ఎత్తుకెళ్లినట్టుగా బంధువులు ఆరోపిస్తున్నారు. వ్యాపారస్తుల మధ్య లావాదేవీల్లో భాగంగా కిడ్నాప్ జరిగినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. కిడ్నాప్ కలకలంతో పోలీసులు రంగంలోకి దిగారు. వ్యాపారిని కిడ్నాపర్ల చెర నుంచి విడిపించేందుకు స్పెషల్ టీంలను ఏర్పాటు చేశారు.గుంటూరు నగరానికి చెందిన మిర్చీ వ్యాపారులు నరేంద్ర కుమార్, బర్మా వెంకట్రావుల మధ్య గత కొన్నేళ్లుగా లావాదేవీల్లో గొడవలు జరుగుతున్నాయి. నరేంద్ర తనకు ఐదు కోట్ల రూపాయలు ఇవ్వాలని బర్మా వెంకట్రావు ఆరోపిస్తున్నారు. నరేంద్రకు మిర్చిని విక్రయించానని వాటి తాలూకా తనకు డబ్బులు రావాలని వెంకట్రావు వాదన. దీనిపై పోలీస్ స్టేషన్లలో నరేంద్ర ఫిర్యాదు కూడా చేశాడు. మరోవైపు వెంకట్రావు వద్ద నుంచి డబ్బులు రావాల్సిన మిర్చీ రైతులు కూడా పోలీసులకు కంప్లయింట్ చేశారు. వెంకట్రావు మాత్రం తనకు నరేంద్ర డబ్బులివ్వాలని అవి రాగానే చెల్లిస్తానంటూ చెబుతూ వచ్చాడు. ఇదే విషయం మిర్చీ యార్డులోని పెద్దల వద్ద కూడా పంచాయితీ జరిగింది. ఎన్ని చోట్లకు వెళ్లిన ఇద్దరి మధ్య ఉన్న సమస్య పరిష్కారం కాలేదు. ఈ క్రమంలోనే ఈరోజు ఉదయం ఎనిమిది గంటల సమయంలో మిర్చి యార్డు నుంచి బైకుపై వస్తున్న నరేంద్రను ఇన్నోవా కారులో వచ్చిన నలుగురు దుండగులు అడ్డుకున్నారు. నలుగురు దుండగులు నరేంద్రను కొట్టి ఇన్నోవా కారులో కిడ్నాప్ చేశారు. విషయం తెలిసిన బంధువులు హుటాహుటిన యార్డు వద్దకు వచ్చారు. మిర్చి యార్డు నుంచి కిలో మీటర్ దూరంలోనే కిడ్నాప్ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కిడ్నాప్ విషయం తెలిసిన వెంటనే వ్యాపారులు మిర్చి యార్డు వద్ద ఆందోళనకు దిగారు. వ్యాపారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిందుతుల వద్ద నుంచి వ్యాపారిని క్షేమంగా కాపాడాలని డిమాండ్ చేశారు. మిర్చి యార్డు నుండి వస్తున్న తన తండ్రిని కిడ్నాప్ చేసినట్లు నరేంద్ర కొడుకు చైతన్య పోలీసులకు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని కిడ్నాపర్లను పట్టుకునే పనిలో పడ్డారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

## వెల్లంపల్లి వర్సెస్ సామినేని

విజయవాడ, ఫిబ్రవరి 2, వైసీపీలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్ల కేటాయింపు భయం పట్టుకుంది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ వస్తుందో రాదోననే ఆందోళనలో ఉన్న వారిలో మాజీ మంత్రి వెల్లంపల్లి కూడా ఉన్నారు. నియోజక వర్గంలో రకరకాల కారణాలతో గ్రాఫ్ పడిపోయిన వారిలో వెల్లంపల్లి శ్రీనివాసరావు కూడా ఉన్నారు. గడపగడపకు తిరుగుతున్నా ఎమ్మెల్యే గ్రాఫ్ అంతంత మాత్రంగానే ఉండటం, తెర వెనుక తనను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానం ఆయన్ని వేధిస్తోంది. పశ్చిమ నియోజక వర్గంలో తనకు పోటీ నాయకుల్ని సొంత పార్టీ నేతలే ప్రోత్సహిస్తుండటంతో రగిలిపోయారుదీంతో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తాజాగా అందరూ చూస్తుండగానే తీవ్రస్థాయిలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. విజయవాడ నగర పార్టీ అధ్యక్షుడు బొప్పన భవకుమార్ పుట్టిన రోజు వేడుకల్లో ఇద్దరు నేతలు తీవ్ర పదజాలంతో ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన నాయకుడిని ముఖ్యమంత్రి దగ్గరకు నువ్వెలా తీసుకెళ్తావంటూ వెలంపల్లి శ్రీనివాస్, ఉదయభానుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నీలా ఎప్పటికప్పుడు పార్టీలను మారే వ్యక్తిని తాను కాదంటూ ఉదయభాను అంతే కోపంతో వెలంపల్లిపైకి వెళ్లడంతో మిగిలిన వారు విస్తుపోయారువైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు బహిరంగంగా దుర్భాషలాడుకోవడం చూసి ఖంగుతిన్న నేతలు ఇద్దరికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. వైసీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ జన్మదినం సందర్భంగా పటమటలోని పార్టీ కార్యాలయానికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చారు. అక్కడి నుంచి తిరిగి వెళ్తున్న సమయంలో పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ వచ్చారు.ఉదయభానును చూడగానే వెలంపల్లి ఆగ్రహంతో... తన నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను సీఎం జగన్ దగ్గరకు తీసుకెళ్లడానికి 'నువ్వు ఎవరు అని ప్రశ్నించి పార్టీలో నువ్వేమైనా పోటుగాడివా..' అని దూషించారు. వెల్లంపల్లి వైఖరి ఊహించని సామినేని ఉదయభాను ' పార్టీలో తాను సీనియర్ లీడర్‌ను. నీలా పదవి కోసం పార్టీలు మారలేదని రిప్లై ఇచ్చారు. మూడు పార్టీలు మారిన ఊసరవెల్లివి అంటూ, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడమని తీవ్రంగా హెచ్చరించారు. తనకు చెప్పడానికి నువ్వెవరివి అని నిలదీశారు. ఉదయభాను, వెల్లంపల్లి ఆగ్రహంతో ఒకరిపైకి మరొకరు వెళ్లడంతో వారి అనుచరులు పక్కకు తీసుకెళ్లడంతో గొడవ సద్దుమణిగింది.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ వైసీపీలో క్రియాశీలకం అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆకుల శ్రీనివాసరావు పోటీ చేసి ఓడిపోయారు. నాటి ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన వెలంపల్లి ఓటమి పాలయ్యారు. ఆకుల శ్రీనివాస్ వైఎస్సార్సీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు మంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులతో ప్రయత్నాలు చేస్తున్నారు. బలమైన సామాజిక వర్గం కావడంతో పశ్చిమలో పట్టుందని చూపే ప్రయత్నాలు చేస్తున్నారు.జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తన నియోజకవర్గ సమస్యలపై మాట్లాడేందుకు గతవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో ఆకుల శ్రీనివాస్ ఎదురుపడ్డారని చెబుతున్నారు. ఈ నెల 28న తన కుమార్తె వివాహమని, సీఎం జగన్‌కు ఆహ్వాన పత్రిక ఇచ్చేందుకు వచ్చానని ఆకుల చెప్పడంతో ఉదయభాను తనతో పాటు శ్రీనివాస్‌ను సీఎం వద్దకు తీసుకువెళ్లి వివాహ ఆహ్వానపత్రిక అందజేయించారు. తన మీద పోటీచేసిన వ్యక్తిని సొంత పార్టీ ఎమ్మెల్యే జగన్ వద్దకు తీసుకెళ్లడంతో మాజీ మంత్రి వెల్లంపల్లి రగిలిపోయారు. ఉదయభాను కనిపించగానే కసి తీర్చుకునే ప్రయత్నించారు. వెల్లంపల్లి ఆక్రోశానికి కారణమైన ఆకుల శ్రీనివాస్ అనుకున్నది సాధిస్తారో లేదో కానీ పార్టీ నాయకుల దగ్గర మాత్రం వెల్లంపల్లిని విలన్ చేయడంలో సక్సెస్ అయ్యారు.


## సింహపురిలో మరో అసంతృప్తి నేత

నెల్లూరు, ఫిబ్రవరి 2, ( నిన్నటి వరకు రెండో భార్య, అసలు కొడుకు అంటూ విమర్శలను ఎదుర్కొన్న ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఇప్పుడు మరో సంచలనంతో వార్తల్లోకెక్కారు. తన నియోజకవర్గంలో పార్టీ నియమించిన పరిశీలకుడి వ్యవహారం బాగోలేదని ఆరోపించారు. అసంతృప్తి వెళ్లగక్కారు. శాసనసభ్యుడికి ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించాల్సిన పరిశీలకుడు.. నియోజకవర్గంలో చిచ్చు పెడుతున్నాడని ఆరోపించారు. తనను ధనుంజయరెడ్డి ఇబ్బంది

పెడుతున్నాడంటూ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశానని అన్నారు. పరిశీలకుడు ధనుంజయ రెడ్డి నిర్ణయాల వల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తోందన్నారు. వైఎస్సార్ కుటుంబానికి విధేయుడైన తనపై అతను పెత్తనం చేయడం కుదరదన్నారు. ముఖ్యమంత్రి దగ్గరైనా, జిల్లా మంత్రి దగ్గరైనా తేల్చుకోవడానికి తాను సిద్ధమన్నారు. నెల్లూరు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరిగా పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పార్టీని వీడుతున్నట్లు ప్రకటించగా, ఆనం రాంనారాయణ రెడ్డి కూడా అదే ఆలోచనలో ఉన్నారు. ఒకరు ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేస్తే, మరొకరి అధికారులు సహకరించడంలేదంటున్నారు. ఆనం, కోటంరెడ్డి వ్యవహారం ముగియక ముందే మరో వైసీపీ ఎమ్మెల్యే అసంతృప్తి స్వరం వినిపించారు. ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయగిరి నియోజకవర్గంలో పరిశీలకుడు చిచ్చు పెడుతున్నారని ఆరోపణలు చేశారు. తనను ధనుంజయరెడ్డి ఇబ్బంది పెడుతున్నారని, ఈ విషయంపై సీఎంకు ఫిర్యాదు చేశానని చంద్రశేఖర్ రెడ్డి బాహాటంగా ప్రకటించారు.

## కలకలం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్

నెల్లూరు, ఫిబ్రవరి 2, ధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఎమ్మెల్యే కోటంరెడ్డి, శ్రీధర్ రెడ్డి ఆరోపణలు సంచలనం రేకెత్తించాయి. ఇప్పటికే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యలపై దుమారం రేగింది. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో పాటు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి కూడా కౌంటర్ ఇచ్చారు. ఈ అంశం పెద్ద ఎత్తున వివాదానికి దారి తీయడంతో ప్రభుత్వం వైపు నుంచి కూడా విచారణ చెయ్యాలని జగన్ సర్కార్ భావిస్తుంది. దీంతో హోం శాఖ అధికారులు సచివాలయంలో ఈ వ్యవహారంపై అంతర్గంగా సమావేశం అయ్యారు. కోటంరెడ్డి చేసిన ఆరోపణలు, బయటకి వచ్చిన ఆడియో టేపుల వ్యవహారంపై అధికారులు ఆరా తీస్తున్నారు. దీంతో అటు పార్టీ పరంగా కోటంరెడ్డికి కౌంటర్ అటాక్ ఇవ్వడంతో పాటు, ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణలపై కూడా అధికార యంత్రాంగంతో కూడా విచారణ చేయించడం ద్వారా ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్ గా పరిగణిస్తుంది.అటు ప్రభుత్వాన్ని ఇటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని కూడా టార్గెట్ చేసిన నేపథ్యంలో ప్రభుత్వంలోని పెద్దలతో పాటు అటు అధికార యంత్రాంగంతో ఆరాతీయించే పనిలో ఉన్నారు. కోటంరెడ్డికి సంబంధించిన వ్యాఖ్యలు పరిశీలించడంతో పాటు ఆయన నిర్వహించిన ప్రెస్ మీట్ వీడియోలు కూడా క్షుణ్ణంగా పరిశీలించి, ఫోన్ ట్యాపింగ్ పేరుతో ప్రభుత్వాన్ని, పార్టీని టార్గెట్ చేసినట్టు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగానే టీడీపీలో చేరతానంటూ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడినట్లుగా చెబుతున్న ఫోన్ రికార్డింగ్ లు బయటికి రావడంతో కుట్రలో భాగమనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. విచారణలో థర్డ్ పార్టీతో ఎంక్వైరీ చెయ్యించాలని, అవసరం అయితే కేంద్ర ప్రభుత్వ సంస్థతో విచారణ చెయ్యించాలని పార్టీ వర్గాలు భావిస్తున్నారు. ఇవి అన్నిసాధ్యం కానీ పక్షంలో కేంద్ర ప్రభుత్వంలో పదవీ విమరణ చేసిన అధికారులతో నైనా ఈ విషయంపై అంతర్గతంగా విచారణ చేయిస్తే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని కుట్రలో ఎవరి భాగం ఎంత అన్నది కూడా తెలుస్తుందని సర్కార్ సీరియస్ గా పరిశీలిస్తుంది.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రోజు రోజు కు కోటంరెడ్డి దూకుడు పెంచడంతో సీఎంవో నుంచి కూడా ఈ అంశంపై ఆరాతీస్తున్నారు. మంత్రులతో పాటు కేంద్ర పార్టీ కార్యాలయం వేదికగా నేతలతో సీఎంవో అధికారులు మాట్లాడడంతో పాటు పోలీస్, నిఘా వర్గాల నుంచి కూడా సీఎంవో అధికారులు సమాచారాన్ని సేకరిస్తున్నారు. తాజా గా కోటంరెడ్డి ఐఏఎస్ అధికారులను కూడా ఇన్వాల్వ్ చెయ్యడంతో ఆ దిశగా కూడా ప్రభుత్వం విచారణ చేస్తుంది.సీనియర్ నేతలు ఎదురుదాడి ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యేలు ఆరోపణలు చేస్తూండటంతో సీనియర్ నేతలు ఎదురుదాడి ప్రారంభించారు. పలువురు మాజీ మంత్రులు సీఎం జగన్ ను క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ట్యాపింగ్ అంశం పై కోటంరెడ్డికి మాజీ మంత్రులు కౌంటర్ ఇచ్చారు.. చంద్రబాబు మంత్రి పదవిని ఆఫర్ చేసి ఉంటారని అందుకే కోటం రెడ్డి టీడీపీలో చేరతానని ప్రకటన చేసినట్లుగా ఉందని కొడాలి అనుమానం వ్యక్తం చేశారు. కోటంరెడ్డికి మంత్రి పదవి ఇవ్వడం సాధ్యం కాదని సీఎం జగన్ చెప్పి ఉండవచ్చని, అయితే కోటంరెడ్డి కన్నా సీనియర్లు చాలా మంది ఉన్నారని నాని అన్నారు. మంత్రి పదవి ఆశించి నా దగ్గరకు రావద్దని జగన్ చెబుతున్నారని, ఎమ్మెల్యే సీట్ ఇస్తా పోటీ చెయ్ అని సీఎం జగన్ స్పష్టంగా చెబుతున్నారని చెప్పారు. సామాజిక వర్గ సమీకరణాలు కూడా ముఖ్యమని అన్నారు. శ్రీకాంత్ రెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇలా కొంత మంది నేతలు ఉన్నారని, బాలినేని మంత్రి పదవి వదులు కున్న విషయాన్ని కొడాలి గుర్తు చేశారు. సీఎం జగన్ ఫోన్ ట్యాపింగ్ చేసి చెత్త మాటలు వినాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీ ప్రతిపక్షం లో ఉండగా 23 మంది పకోడీలు వెళ్లిపోయారు ఏమయ్యిందని నాని ప్రశ్నించారు. ఎస్సి ఎస్టీ బిసి లకు ఎన్ని పదవులు వచ్చాయి... అన్ని అగ్ర కులాలకు ఇస్తే ఎలా అన్న విషయాన్ని జగన్ ఆలోచించారని చెప్పారు. ఉండే వాళ్ళు ఉంటారు పోయే వాళ్ళు పోతారని, చంద్రబాబు గాలి కబుర్లు చెప్పారని ఓడించిన నేతలు ఇప్పుడు మరలా అక్కడికే వెళుతున్నారని వ్యాఖ్యానించారు.ప్రతి మనిషి ఫోన్ లో రికార్డింగ్ యాప్ ఉంటుందని చెప్పారు. ప్రతి కాల్ రికార్డ్ చేసి సర్క్యులేట్ చెయ్యచ్చు ని, సీఎం జగన్ పై ఎబ్బెట్టు గా మాట్లాడారు కాబట్టి కాల్ రికార్డ్ పంపించారని పేర్ని నాని స్పష్టం చేశారు. తాను కూడా ఎవరితో అలా మాట్లాడితే పంపిస్తారని వ్యాఖ్యానించారు. టాప్ చేయాల్సిన అవసరం ఎవరికి ఉంటుందని, కేవలం బురద వేయడానికి ఏదైనా చెప్తారని అన్నారు. సానుభూతి కోసం మాట్లాడతున్నారని, ఫోన్ ట్యాపింగ్ జరిగితే అప్పుడే చెప్పాలి కదా అని ప్రశ్నించారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా చేసినా మంత్రి పదవులు లేవని, సామాజిక వర్గ కూర్పు లో కొన్ని సార్లు పదవులు రావన్నారు. వైసీపీలో జగన్ పై అసంతృప్తి ఉంటే, అది స్పష్టం చేసుకోవచ్చని చెప్పారు. జగన్ పార్టీ పెట్టకపోతే ఎవరైనా ఎమ్మెల్యేలు మంత్రులు అవుతారా అని ఆయన ప్రశ్నించారు. ట్యాపింగ్ పై ఎక్కడైనా ఫిర్యాదు చేస్కోవచ్చని సవాల్ చేశారు. ట్యాపింగ్ చేస్తే భయపడాలని, టీడీపీ నుంచి పోటీ చేస్తానని ఆయనే చెబుతున్నారు కాబట్టి.. ఆ విషయాలు అన్నీ కోటం రెడ్డికే తెలియాలన్నారు. న్యాయస్థానంలో మాట్లాడిన మాటలు బయట ప్రచారం చేయటం సరైంది కాదని అన్నారు. అయితే న్యాయమూర్తి మాట్లాడిన మాటలు బయటకు ఎలా వస్తాయని ఆయన ప్రశ్నించారు. న్యాయస్థానం



విషయంలో అందరూ సైలెంట్ గా ఉన్నారా అని ప్రశ్నించారు. వీళ్లంతా.. పోటుగాళ్లా ఇప్పుడు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వద్ద ట్యాపింగ్ చేసే సాఫ్ట్ వేర్ లేదని పేర్ని నాని వ్యాఖ్యానించారు.

## హత్యాయత్నం కేసును గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు

పల్నాడు : హత్యాయత్నం కేసును గంటల వ్యవధిలో పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి,హత్యాయత్నానికి ఉపయోగించిన తుపాకీని రొంపిచర్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో ఆధిపత్యం నేపథ్యంలో జరిగిన ఘటన అని పోలీసులు నిర్ధారించారు. పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ రొంపిచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని అలవాల గ్రామంలో వెన్నా బాల కోటి రెడ్డి అనే వ్యక్తిపై తుపాకీతో కాల్పులు జరిపి హత్యాయత్నానికి పాల్పడినారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,నరసరావుపేట డిఎస్పీ విజయభాస్కరరావు గారి పర్యవేక్షణలో నరసరావుపేట రూరల్ సీఐ భక్తవత్సల రెడ్డి గారు,రొంపిచర్ల ఎస్సై సురేష్ గారులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టామని అన్నారు. నిందితులు పమ్మి వేంకటేశ్వర రెడ్డి, పులి అంజి రెడ్డి, వంటిపులి వెంకటేశ్వర్లు, పూజల రాములు లను అరెస్ట్ చేసారు. బాధితుడు బాలకోటిరెడ్డి రొంపిచర్ల మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు. ముద్దాయి వెంకటేశ్వరరెడ్డి అయనకు వరుసకు అల్లుడవుతాడు. ఇద్దరూ టిడిపి పార్టీలో ఉంటూ గ్రామంలో జరిగే అన్ని కార్యక్రమానికి వెళతారు. ఈ నేపథ్యంలో గత పంచాయతీ ఎలక్షన్లలోను, అలవాలా గ్రామంలో జరుగు ప్రసన్నంజనేయ స్వామి తిరునాళ్ళకు సంబంధించి ఇద్దరికి భేదాభిప్రాయలు తలెత్తాయి. తనని పార్టీలో పైకి రాకుండా అణచివేస్తున్నాడని, ఫిర్యాది బాలకోటిరెడ్డి ఉండగా తనకు పార్టీలో స్థానం ఉండదని నిందితుడు అభిప్రాయపడ్డాడు.

# రిషికొండ, భీమిలీ ప్రాంతాల్లోనే సీఎం క్యాంపు ఆఫీసు..?

విశాఖపట్టణం, ఫిబ్రవరి2, రాజధాని మాటెలా ఉన్నా సీఎం క్యాంపు కార్యాలయం వైజాగ్ కు షిఫ్ట్ చేయడం ఖాయం అని తేలిపోయింది. ఢిల్లీ వేదికగా జరిగిన ఇన్వెస్టర్స్ సదస్సులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్వయంగా ఈ ప్రకటన చేసారు. ఆయనైతే ఏకంగా రాజధాని కూడా వైజాగే అన్న క్లారిటీ ఇచ్చేసారు. దీనిపై విపక్షాలు విమర్శలు మొదలెట్టాయి. రాజధాని కేసుల వ్యవహారం ఇంకా కోర్టుల పరిధిలోనే ఉండగానే ముఖ్యమంత్రి ఇలాంటి ప్రకటన చేయడం సరికాదని వారన్నారు. అయితే వైసీపీ కీలక నేత, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ నెల నాటికి అన్ని న్యాయపరమైన అడ్డంకులూ దాటుకుని రాజధానిని వైజాగ్ కు మారుస్తామని అన్నారు. దానితో వైజాగ్ నుంచి పాలన మొదలెట్టడానికి సీఎం జగన్ పట్టుదలగా ఉన్నారన్న క్లారిటీ వచ్చేసినట్లయింది . ప్రస్తుతానికి అందుతున్న సమాచారం బట్టి సీఎం ముందుగా వారానికి మూడు రోజులు వైజాగ్ నుంచి మిగిలిన రోజులు అమరావతి నుంచి పాలన చేయనున్నట్టు సమాచారం. తరువాత వీలుచూసుకొని నెమ్మదిగా మొత్తం పరిపాలన విశాఖ కేంద్రంగానే జరుపనున్నారు . సీఎం జగన్ తో పాటు రానున్న మూడు నెలల్లో సమాచార శాఖ , ఐటీ మినిస్ట్రీ, పరిశ్రమల శాఖ , ఎడ్యుకేషన్ , స్కిల్ డెవలప్‌మెంట్, సీఐడీ, విజిలెన్స్, హెల్త్ మినిస్ట్రీ, టూరిజం శాఖ వంటి శాఖలను విశాఖకు షిఫ్ట్ చేసే ఆలోచనలో ఉంది సీఎంవో అని వార్తలు వినిపిస్తున్నాయి.విశాఖకు సీఎం షిఫ్ట్ అవుతారనే సమాచారం దాదాపు ఏడాది పైగానే అధికారుల వద్ద ఉంది. అలాంటి పరిస్థితి వస్తే సీఎం ఎక్కడి నుంచి పాలన చెయ్యాలనే దానిపై వారు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసారు. దానికి అనుగుణంగా సిటీలో అయితే కలెక్టర్ భవనం , ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలోని బిల్డింగ్స్ పై ఒక కన్నేసి ఉంచారు. ఏయూ గ్రౌండ్స్ లో ఇటీవల ప్రధాని పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన హెలి పాడ్ వంటి సౌకర్యాలను ఇప్పుడు పెర్మనెంట్ ఫెసిలిటీ గా మార్చారు. ఒకవేళ సీఎం రాకపోకలకు ఆ ప్రదేశాలు ట్రాఫిక్ కారణంగా కరెక్ట్ కాదనుకుంటే భీమిలి రోడ్డులోనూ.. మధురవాడ సమీపం లోనూ ఐటీ పరిశ్రమల కోసం నిర్మించిన వేల సంఖ్యలో ఖాళీగా ఉన్న ఫ్లాట్స్ ఉన్నాయి. ఇక రిషికొండ పై అనేక వివాదాల నడుమ రెడీ అవుతున్న భవనం ఉండనే ఉంది . ఓవరాల్ గా చెప్పాలంటే రిషికొండ , భీమిలి , ఆనందపురం ఏరియాల్లో సీఎం నివాసం , తాత్కాలిక సెక్రటేరియట్ లాంటివి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి ఢిల్లీ పర్యటనలో సీఎం జగన్మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే విశాఖపట్నం ఏపీ రాజధానిగా మారబోతోందని ప్రకటించారు. తాను కూడా అక్కడికి మారుతున్నట్లుగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సన్నాహక సదస్సులో మాట్లాడుతూ స్వయంగా చెప్పారు. ఇన్వెస్టర్లను ఉద్దేశించి ఈ సమావేశంలో సీఎం జగన్ ప్రసంగించారు. కాబట్టి, పెట్టుబడిదారులు విశాఖపట్నానికి రావాలని ఆహ్వానించారు. మార్చి 3, 4 తేదీల్లో ఇన్వెస్టర్ల సదస్సు విశాఖపట్నంలోనే జరగనుందని జగన్ చెప్పారు. ఒక్కసారిగా రాష్ట్రంలో ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. దీనిపై విపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ వేగం పెంచడంతో ఉన్నపళంగా సీఎం జగన్.. విశాఖ రాజధాని ప్రకటన చేశారని అన్నారు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్. హత్య జరిగిన రోజు అవినాష్ రెడ్డి.. ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడారన్న అంశం ఇప్పుడు కీలకంగా మారిందని, ఆ కాల్ డేటా వివరాలు బయటకు రాకుండా.. ప్రజల దృష్టిని మరల్చేందుకే సీఎం జగన్.. విశాఖ రాజధాని అంటూ ప్రకటన చేశారని అన్నారు.

## జగన్ కు సామాజిక వర్గం దూరమౌతోందా....

విజయవాడ, ఫిబ్రవరి 2, వైయస్ జగన్ ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తర్వాత.. ఓ విధంగా రాష్ట్రంలో రెడ్డి రాజ్యం నడుస్తోందంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు వరుస ఆరోపణలు గుప్పిస్తున్నారు. అంతేకాదు.. ప్రభుత్వంలో కొలువు దీరిన సలహాదారుల రూపంలో అయితేనేమి.. వివిధ కార్పొరేషన్ సంస్థల అధిపతులుగా నియమించడంలో అయితేనేమి.. వివిధ నామినేటేడ్ పోస్టులు కట్టబెట్టడంలో అయితేనేమి.. టీటీడీ చైర్మన్, ఈవో వంటి పదవుల విషయంలో అయితేనేమి, శాసన మండలి చైర్మన్, ఈవో పదివిలో అయితేనేమి మొత్తం రెడ్డి సామాజిక వర్గం వారికే మనసా వాచా జగన్ ప్రభుత్వం కట్టబెట్టింది. అయినా కూడా జగన్ సర్కార్ పట్ల రెడ్డి సమాజిక వర్గంలో ఆసంతృప్తి తారాస్థాయికి చేరింది. ప్రస్తుతం ఉన్న స్థాయిలో రెడ్డి సమాజికవర్గంలో అసంతృప్తి గతంలో ఎన్నడూ లేదని ఆ సమాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులే అంతర్గత సంభాషణల్లో చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఇదే సామాజిక వర్గానికి చెందిన ముఖ్యమంత్రులు .. కాసు బ్రహ్మానందరెడ్డి, చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి , వైఎస్ రాజశేఖరరెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాలలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితులు ఎదురుకాలేదని చెబుతున్నారు.మరోవైపు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో రెడ్లదే రాజ్యమని.. అయితే వైయస్ రాజశేఖర రెడ్డి ఆకస్మిక మరణంతో.. ఆ తర్వాత వచ్చి కె రోశయ్య ప్రభుత్వంలోనే కాదు.. ఆ గద్దెనెక్కిన కిరణ్ కుమార్ ప్రభుత్వం వరకు ఇదే పరిస్థితి కొనసాగిందని.. దీంతో రెడ్లకు దక్కాల్సిన ప్రాధాన్యత ఎక్కడా తగ్గలేదని చెబుతున్నారు.ఇక జగన్.. ముఖ్యమంత్రి అయితే.. తమకు పూర్వ వైభవం వస్తోందని.. తమ సామాజిక వర్గానికి జగన్ ఓ ఆశాకిరణమని ఆ సామాజిక వర్గం వారు భావించారు. వైఎస్ ప్రభుత్వంలో దక్కిన మర్యాద, ప్రాధాన్యత మళ్లీ దక్కుతోందని ఆ సామాజిక వర్గానికి చెందిన వారంతా వైసీపీలో చేరిపోయారు. దీంతో 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం కొలువు తీరినా.. ప్రతిపక్షనేతగా వైయస్ జగన్‌కు అత్యంత గౌరవప్రదమైన స్థానం దక్కింది. 2019 ఎన్నికలకు ముందు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన యువత జగన్ పాదయాత్ర లో రోడ్లు మీదకు వచ్చి మరీ తమ శక్తి కొలది ఖర్చు చేసి.. తమ విలువైన సమయాన్ని సైతం పక్కన పెట్టి.. మరీ జగన్ గద్దెనెక్కేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశారు. 2019 ఎన్నికల్లో జగన్ పార్టీ గెలుపు.. నల్లేరు మీద నడకే అయిందని..ఈ నేపథ్యంలో తమకు గౌరవం, విలువ దక్కుతోందని సదరు సామాజికవర్గం భావించింది కానీ, జగన్ హయాంలో కనీస గౌరవం కూడా దక్కడం లేదని సదరు సామాజిక వర్గం వాపోతోంది. రెడ్డి సామాజిక వర్గం చూపు తెలుగుదేశం వైపు మళ్లిందని అంటున్నారు. అందుకు ఉదాహరణ.. ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆదాల ప్రభాకర్ రెడ్డి.. అలాగే ప్రకాశం జిల్లా నుంచి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఉమ్మడి కడప జిల్లా నుంచి డీఎల్ రవీంద్రారెడ్డి, వీరశివారెడ్డి,వరదరాజులు రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి గంగుల ఫ్యామిలీ, బైరెడ్డి ఫ్యామిలీలు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు భారీ సంఖ్యలో రెడ్లు... పసుపు కండువా కప్పుకునేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది.

## మళ్లీ పల్నాడులో భగభగలు

గుంటూరు, ఫిబ్రవరి 2, పల్నాడు జిల్లా ఆలవాలంలో ఫైరింగ్ ఘటనపై పోలీసులు దృష్టి సారించారు. రొంపిచర్ల టీడీపీ మండలాధ్యక్షుడు బాలకోటిరెడ్డిపై ప్రత్యర్థులు ఇంట్లోకి చొరబడి రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం అక్కడినుంచి పారిపోయారు. ప్రస్తుతం నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాలకొటిరెడ్డికి చికిత్స కొనసాగుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు స్పాట్‌కు చేరుకుని.. వివరాలు సేకరించారు. ఫైరింగ్ జరిపిందెవరు.. ఎందుకు హత్యాయత్నం చేశారన్న కోణంలో ఆరాతీస్తున్నారు. మరోవైపు కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న బాలకోటిరెడ్డిని టీడీపీ నేతలు పరామర్శించారు.గతేడాది జులైలో అలవల నుంచి చిట్టిపోతుల వారి పాలెం మార్గంలో ఉదయం వాకింగ్‌కు వెళ్లిన బాల కోటిరెడ్డిపై దుండగులు కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రిలో వైద్యం తర్వాత కోలుకున్నారాయన. ఆ ఘటన మరువకముందే మరోసారి బాలకొట్టిరెడ్డిపై కాల్పులు జరగడం కలకలం రేపుతోంది. అయితే అప్పుడు ఇప్పుడు మర్డర్ అటెంప్ట్ చేసింది పమ్మి వెంకటేశ్వర్‌రెడ్డినేనని నిర్ధారణ అయింది.పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం అలవాలలో కాల్పులు జరిగాయి. టీడీపీ మండలాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ బాలకోటిరెడ్డిపై ప్రత్యర్థులు రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు గన్‌తో కాల్చి జరిపింది వెంకటేశ్వరరెడ్డి అని అనుమానిస్తున్నారు. గాయాలపాలైన బాలకోటిరెడ్డిని కుటుంబ సభ్యులు నర్సరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని స్పాట్‌ని పరిశీలించారు. బాధితుడిని టీడీపీ నేతలు ఆసుపత్రిలో పరామర్శించారు.



## ఫోన్ ట్యాపింగ్ పై నిఘా వర్గాల విచారణ


అమరావతి : వైకాపా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి టెలిఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకున్న ప్రభుత్వం, నిఘా వర్గాలను రంగంలోకి దింపింది. మంత్రులు మాత్రం అది ట్యాపింగ్ కాదు...రికార్డింగ్ అంటున్నారు. దాంతో నిగ్గు తేల్చేందుకు ఇంటెలిజెన్స్ అధికారులు పని ప్రారంభించారు. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి విడుదల చేసిన ఆడియో పై వివరాల సేకరించారు. శ్రీధర్ రెడ్డి తో మాట్లాడిన రామ శివారెడ్డి ని విచారించే అవకాశం వుంది. రామ శివా రెడ్డి ఫోన్ డేటాను విశ్లేశిస్తున్నాట్లు సమాచారం.

## జంపింగ్ లు ..జంపాంగ్ లు రెడీ

నెల్లూరు, ఫిబ్రవరి 2,ఎన్నికలు దగ్గరపడే సమయంలో జంపింగ్ లు సర్వసాధారణమే. వచ్చే ఎన్నికల్లో తమకు టిక్కెట్ రాదనుకున్న నేతలు ముందుగానే పార్టీలను ఫిరాయించడం పరిపాటి. ఏమాత్రం టిక్కెట్ రాదని డౌటున్నా సరే.. వెంటనే తాము ఉన్నా పార్టీపై ఆరోపణలు చేయడం, వెంటనే తమకు సీటు ఖరారు చేసే పార్టీలోకి ఫిరాయించడం మామూలే. 2019 ఎన్నికలకు ముందు ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా టీడీపీ నుంచి వైసీపీలోకి జంప్ అయ్యారు. తమకు టిక్కెట్ ఇచ్చిన నాయకత్వంపైనే సూటిగా విమర్శలు చేస్తారు. నాయకత్వంలో ఉన్న లోపాలను, పార్టీలో ఉన్న లొసుగులను ప్రస్తావిస్తారు. అంతే కాదు... తాము ఎన్ని అవమానాలకు గురయిందీ ప్రజలకు వివరించే ప్రయత్నం ఖచ్చితంగా చేస్తారు. మొన్న ఆనం రామనారాయణరెడ్డి.. నేడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఇద్దరూ ప్రభుత్వంపై ఆరోపణలకు దిగారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేశారంటూ తీవ్రస్థాయి విమర్శలు చేస్తున్నారు. తమపై అనుమానం వచ్చి తమపై నిఘా పెట్టేందుకే ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని చెబుతున్నారు. అధికారంలో ఉన్న పార్టీ కావడంతో తాము ఫిర్యాదు చేయలేకపోతున్నామని కూడా వివరణ ఇచ్చుకుంటున్నారు. తమ దగ్గర పక్కా ఆధారాలున్నాయంటున్న ఇరువురు నేతలు వచ్చే ఎన్నికల్లో తమ భవిష?యత్ ను ముందుగానే నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది కోటంరెడ్డిని రీప్లేస్ చేసేది ఈయనే టీడీపీలో సీటు కన్ఫర్మ్... కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అయితే ఏకంగా వచ్చే ఎన్నికల్లో తాను టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నట్లు క్యాడర్ కు క్లారిటీ ఇచ్చారు. ఆయన ఆడియో లీకవ్వడం ద్వారా ఇది బయటపడింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని కూడా చెప్పారు. అంటే ముందుగానే ఆయన టీడీపీ అధినాయకత్వం నుంచి కన్ఫర్మ్ చేసుకున్నట్లు అర్థమవుతుంది. తాను పార్టీలో చేరితే టిక్కెట్ విషయంలో క్లారిటీ తీసుకున్న తర్వాతనే కోటంరెడ్డి వైసీపీపై విమర్శల జోరు పెంచారనడంలో ఏమాత్రం సందేహం లేదు. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా తొలుత ఆయన సోదరుడు గిరిధర్ రెడ్డిని నియమించాలనుకున్నప్పటికీ పార్టీ హైకమాండ్ ఆ ఆలోచనను విరమించుకున్నట్లు తెలిసింది. కొత్త నేత కోసం వైసీపీ అన్వేషణ చేస్తుందంటున్నారు. బహుశ ఆనం విజయకుమార్ రెడ్డిని నియమించవచ్చన్న టాక్ పార్టీలో నడుస్తుంది. ఆనం రామనారాయణరెడ్డి ఇప్పటికే ఎగ్జిట్ కు రెడీ అయిపోయారు. విడతల వారీగా వీరు పార్టీకి రాజీనామా చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలకు పదిహేను నెలల సమయం ఉండటంతో ఇప్పుడే పార్టీని వీడే అవకాశం లేదు. ఎన్నికలకు ఆరు నెలల ముందే వీరిద్దరూ జంప్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటి వరకూ వీరి నుంచి అధికార పార్టీకి చికాకులు తప్పవు. విమర్శల జోరు కూడా పెంచే అవకాశాలు లేకపోలేదు. పార్టీ సస్పెండ్ చేస్తే వారికే మంచిది. ఎమ్మెల్యేగా చివరి వరకూ కొనసాగవచ్చు. అయితే పార్టీ ఆ నిర్ణయం తీసుకోకపోవచ్చు. అందుకే ఇద్దరు నేతలు హైకమాండ్ కు తలనొప్పిగా మారతారనడంలో ఎటువంటి సందేహం లేదు. అందుకు వైసీపీ కూడా సిద్ధంగా ఉండాలి. ఇక వైసీపీ నుంచి ఎవరెవరు వెళ్లే అవకాశాలున్నాయన్న దానిపైన కూడా పార్టీలో జోరుగా చర్చ జరుగుతుంది. నెల్లూరు జిల్లా నేతలే మరికొందరున్నారని చెబుతున్నారు. జగన్ కు అతి సన్నిహితమైన కుటుంబం నుంచి ఒక సిట్టింగ్ ఎమ్మెల్యే ఇదే జిల్లాలో వైసీపీని వీడే అవకాశముందని చెబుతున్నారు. ఇది ఒక్క నెల్లూరుకే కాదని ఇతర జిల్లాల నుంచి నేతలు తమ పార్టీలోకి వచ్చే అవకాశముందని చెబుతున్నారు. ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నేతల వలసలు ఉండే అవకాశముందంటున్నారు. మంత్రి పదవులు దక్కకపోవడమే ప్రధానంగా అనేక మంది నేతలు వైసీపీలో అసంతృప్తిగా ఉన్నారన్నది వాస్తవం. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తుండటంతో తమ గెలుపు అవకాశాలు మరింత మెరుగుపడతాయన్నది పలుచోట్ల నేతల భావన. అయితే సీటు కన్ఫర్మ్ కావాలి. కన్ఫర్మ్ అయితే మరో నేత నెల్లూరు నేతల బాట పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కిరండోల్-విశాఖ మార్గంలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లాలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. కిరండోల్-విశాఖ మార్గంలోని శివలింగపురం రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.ఛత్తీస్‌గఢ్‌లోని బచేలి నుంచి విశాఖకు ముడి ఇనుముతో వెళ్తున్న గూడ్స్ రైలు శివలింగపురం ఏడో టన్నెల్ వద్ద పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో 8 బోగీలు పక్కకు ఒరిగాయి.బోగీలు పడిపోవడంతో పట్టాల పక్కన ఉన్న కొన్ని విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే ప్యాసింజర్ రైలును అధికారులు రద్దు చేశారు. ప్రయాణికులకు టికెట్ల నగదును తిరిగి చెల్లించారు. రైల్వే డీఆర్‌ఎం సత్పతి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. రైల్వే సిబ్బంది ట్రాక్ పనులను పునరుద్ధరిస్తున్నారు. పూర్తిస్థాయిలో ట్రాక్ పునరుద్ధరణకు 36 గంటలు పట్టే అవకాశముందని రైల్వే సిబ్బంది తెలిపారు.



## డ్రైవర్ల డిమాండ్లను నెరవేర్చాలి......

కమాన్ పూర్ : సింగరేణి సంస్థ ఓసీపీ వన్ లో పనిచేసే కన్వేయన్స్ డ్రైవర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్ డిమాండ్ చేశారు.ఓ.సి.పి1 ఆర్.జి.3 ఏరియా కన్వెయన్స్ డ్రైవర్స్ నిరవధిక సమ్మె శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్ సందర్శించారు. ఆయన వెంట జులపల్లి ఎం.పి.టి.సి.శేవ్వా శంకర్.మైనార్టీ జిల్లా కార్యదర్శి ఇక్బాల్,ఎస్.సి.సెల్ మండలాధ్యక్షుడు మాల్యాల తిరుపతి వున్నారు.శిబిరాన్ని ఉద్దేశించి గాండ్ల మోహన్ మాట్లాడుతూ డ్రైవర్లు జీతాలు పెంచాలని సమ్మెచేయడం సబబే నని ఆయన అన్నారు.

నెల జీతం 21 వేలు సింగరేణి జి.ఓ ప్రకారం ఇవ్వాలని కానీ లారీ.టిప్పర్ ఓనర్స్ కేవలం 16 వేలు మాత్రమే చెల్లిచాలనుకోవడం వల్లే డ్రైవర్స్ సమ్మెకు దిగినారు. సింగరేణి యాజమాన్యం ఓనర్స్ తో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆయన అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వారికి ఏరియర్స్ రావడం లేదని. వారికి ఉద్యోగ భద్రత లేదని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగు సత్యనారాయణ. డ్రైవర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## రైలు పెట్టెలో మృతదేహం లభ్యం

తిరుపతి :గురువారం ఉదయం రైలు పెట్టె లో మృతదేహం లభ్యం అయింది. తిరుపతికి చేరుకున్న కృష్ణ ఎక్స్ ప్రెస్ జనరల్ బోగీలో మృతదేహాన్ని జీఆర్పి పోలీసులు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. మృతుడు ధరించిన దుస్తుల ఆధారంగా అతడి వివరాలను గుర్తించే పనిలో పోలీసులు వున్నారు.

## ప్రతిపక్షాల నినాదాలతో దద్దరిల్లిన విశాఖ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

విశాఖపట్నం : ముడసర్లోవ పార్క్ ను పీపీపీ పద్దతిలో థీమ్ పార్కుగా చేసేందుకు విశాఖ జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేసింది.దీంతో జీవీఎంసీ ఆస్తుల్ని అమ్మేస్తారా అంటూ మేయర్ పోడియంను ప్రతిపక్ష కార్పొరేటర్లు చుట్టుముట్టడంతో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి తలెత్తింది.ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్న సమయంలో ముడసర్లోవ పార్కును పీపీపీ పద్దతిలో ప్రయివేట్ కు అప్పగించేందుకు ఆమోదం తెలిపింది.దీంతో 283 ఎకరాల్లో పార్కు నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.వైసీపీ పెద్దలకే జీవీఎంసీ భూముల్ని కట్టబెడుతున్నారంటూ టీడీపీ, బీజేపీ, జనసేన, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్ల నిరసన వ్యక్తం చేశారు.ప్రతిపక్ష, అధికార పార్టీ సభ్యుల మధ్య భారీ తోపులాట చోటు చేసుకుంది.ఓటింగ్ నిర్వహించి ఆమోదం తెలపాలని మేయర్ నిర్ణయంతో 49మంది సభ్యులు ఆమోదం తెలపగా ప్రైవేట్ వ్యక్తుల చేతికి ముడసర్లోవ పార్క్ వెళ్లనుంది.

## టీవీ చూడనివ్వడంలేదని వేలు కొరికిన దుకాణదారుడు

ములుగు : ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని పాలంపేట గ్రామంలో ఒక వింత సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్తీకదీపం సీరియల్ క్లైమాక్స్ చూస్తుండగా వినియోదారుడు వచ్చి విసిగిసిస్తున్నాడని అతడి వేలును దుకాణదాఉడు కొరికేసాడు. సీరియల్ క్లైమాక్స్ మత్తులో పడిపోయి సీరియల్ ఆఖరి ఎపిసోడ్ చూడనివ్వకుండా విసిగించాడని వాడి మీద దాడి చేసిన దుకాణం దారుడు మందు తాగడానికి వచ్చిన అతని వేళ్ళు కొరికాడు .అనంతరం మళ్లీ విసిగిస్తున్నాడని సీరియల్ మధ్యలో ఉన్నందుకు మళ్లీ విస్తరిస్తున్నాడని కర్ర తీసుకొని దాడి చేసినాడు.. అసలు విషయానికొస్తే సీరియల్ ఆఖరి ఎపిసోడ్ లో చూస్తుండగా అరువు కోసం విసిగించిన వ్యక్తి క్లైమాక్స్ చూసి తట్టుకోలేక అతడి మీద దాడి చేశాడని బాధితుడు వెంకటయ్య తెలిపాడు .ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాలంపేటకు చెందిన గట్టు మొగిలి కిరాణా దుకాణనీ నిర్వహిస్తున్నాడు. మద్యం కూడా విక్రయిస్తున్న అదే గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకటయ్య జనవరి 23 రాత్రి మొగలి దుకాణానికి వచ్చి మద్యం కొనుగోలు చేసి తాగాడు .అనంతరం అరువుకు మరికొంత మద్యం కావాలని విసిగించాడు .ఈ తరుణంలో కార్తీక దీపం సీరియల్ క్లైమాక్స్ చూస్తుండగా మొగలి సహనం కోల్పోయి వెంకటయ్య పై దాడి చేసి అతడి చూపుడు వెళ్లి కొరికేశాడు .ఈ ఘటనపై వెంకటయ్య తర్వాత రోజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు కార్తీక్ దీపం సీరియల్ చూస్తుండగా విసిగించడంతో దాడి చేశానని మొగిలి చెప్పిన సమాధానంతో అవాక్కైనా పోలీసులు మొగిలిపై కేసు నమోదు చేసారు

## మత్స్యకారుల వలలో సైనిక డ్రోన్

శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారుల వలకు మిలటరీ డ్రోన్ చిక్కింది. సంతబొమ్మాలి మండలం భావనపాడు-మూలపేట తీరంలో మత్స్యకారులు వేట చేస్తుండగా వలలో ఈ భారీ డ్రోన్ లభ్యమయ్యింది. సుమారు 9 అడుగుల పొడవు,111 కిలోల బరువుతో విమానాన్ని పోలి విధంగా ఉంది. దీనిపై బ్యాన్ సీ టార్గెట్ అని ఇంగ్లీష్ రాతలతో పాటు 8001 నెంబర్ రాసి ఉంది. మత్స్యకారుల ఈ పరికరాన్ని భావనపాడు మెరైన్ పోలీసులకు అప్పగించారు. దీన్ని పరిశీలించిన మెరైన్ పోలీసులు మిలటరీ డ్రోన్ గా అనుమానిస్తున్నారు. డిఫెన్స్ మిసైల్స్ ప్రయోగం సమయంలో విఫలమై సముద్రంలో పడిపోయి ఉండవచ్చని మెరైన్ పోలీసులు చెబుతున్నారు. దీనిపై నేవీ, కేంద్ర ఇంటిలిజెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు...

## ప్రజలకు భారంగా బడ్జెట్

విశాఖపట్నం : పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామా న్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్,పారిశ్రామిక వర్గాలకు వరంగా సామాన్య ప్రజలకు భారంగా ఉందని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు మండి పడ్డారు. కేంద్రబడ్జెట్లో ఆంధ్రాకు,ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృ ద్ధికి నిధుల కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని ఖం డిస్తూ సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో విశాఖ రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం వద్ద నిరసన చేప ట్టింది. సీపీఐ జిల్లా కార్యా లయం నుంచి రైల్వే స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు.దక్షణకోస్తా రైల్వేజోన్ ప్రకటించి నాలుగేళ్లు గడు స్తున్న నేటికి నిధులు కేటాయించలే దని అన్నారు.రైతుల మద్దతు ధరకు కేవలం లక్ష రూపా యలు కేటాయించా రంటే రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం ఏమేరా శ్రద్ధ చూపెడుతోందో అర్థమౌతోందని అన్నారు.

## మహిళ హత్య..బంధువుల అందోళన

ఏలూరు : చింతలపూడి పట్టణం స్థానిక సుప్రీంపేటకు చెందిన పొట్ల.నాగమణి అని మహిళ హత్య చేసిన హంతకులనువెంటనే శిక్షించాలని స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మృతురాలి బంధువులు ధర్నా నిర్వహించారు. పోలీసులు ఇప్పటివరకుబాడినిఅప్పచెప్పలేదని కుటుంబ సభ్యులు గ్రామస్తులు అంటున్నారు. ధర్నా వద్దకు చేరుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ దోషులు వెంటనే అరెస్టు చేసి కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## వ్యక్తి దారుణ హత్య

### వివాహేతర సంబంధమే కారణం

నూజివీడు :గత నెల మూడో తేదీన అదృశ్యమైన రాయన్నపాటీ రాటాలు కేసును పోలీసులు ఛేదించారు. వివరాల్లోకి వెళితే ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరు మండలం ఎల్లాపురం గ్రామంలో నెల రోజుల క్రితం రాయన్నపాటి. రాటాలు అనే వ్యక్తి అదృశ్యమైనట్లు అతను తండ్రి ముసునూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ రాహుల్దేవ్ శర్మ ఆదేశాల మేరకు నూజివీడు డిఎస్పి అశోక్ కుమార్ గౌడ్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సిఐ అంకబాబు తన సిబ్బందితో రాటాలు భార్య కదిలికలపై ప్రత్యేక నిఘాఏర్పాటు చేశారు.హత్య కేసులో అనుమానితులు నలుగురుని అదుపులోకి తీసుకునీ విచారణ వేగవంతం చేశారు. రాటాలు హత్య కేసుకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. తమ్మిలేరులోని రాటాలు మృతదేహాన్ని గురువారం తవ్వి తీసారు.

### ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ మేమెప్పుడూ ఎన్టీఆర్, బాలయ్య అభిమానులమే బసవరాజ్ గౌడ్







కౌతాళం : మండల కేంద్రంలో ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ క్యాలెండర్ ఆవిష్కరణ ఈడిగ బసవరాజ్ గౌడ్ , ఉమేష్ గౌడ్ , రహిమాన్ చేతులమీదుగా ఎన్టీఆర్ క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈడిగ బసవరాజ్ గౌడ్, రహిమన్ మాట్లాడుతూ మేమెప్పుడూ బాలయ్య, నందమూరి తారకరామారావు అభిమానులమే అని తెలియజేశారు. మా అభిమానం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈరోజు క్యాలెండర్ ఆవిష్కరణ జరగడం మా అభిమానుల మధ్య నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ అభిమానం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాం అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈడిగ నాగరాజు గౌడ్, అబ్దుల్ రెహమాన్, నరసింహులు, వీరు గౌడ్, అశోక్ గౌడ్ ,శ్రీను, రమేష్, బ్లడ్ బసవరాజ్, తదితరులు అభిమానులు పాల్గొన్నారు నిర్వహించారు.

## మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర మిడియో సెక్రటరీ కి ఘన సన్మానం

నంద్యాల :-. ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర మీడియా సెక్రెటరీ గా ఎన్నిక అయిన జావిద్ గారిని ఆల్ మిడియో కంప్యూటర్స్ సెంటర్ వారు ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమములో ముఖ్య అతిథులుగా సయ్యద్ అసదుళ్ళ గారు మరియు చైర్మన్ ఆకుమల్ల రహీమ్ మాట్లాడుతూ జావిద్



గారు మంచి సేవా గుణం కలిగి స్వతహాగా ఒక పత్రికను స్థాపించి సామాజిక స్పృహ తో సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు చేర వేస్తున్న ఒక మంచి భావజాలం కల్గిన గొప్ప వ్యక్తి అని , ఇలాంటి వ్యక్తిని గుర్తించి అల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ వారు రాష్ట్ర మీడియా సెక్రెటరీ గా భాద్యతలు ఇవ్వడం ఆ సంస్థ ఆశయాలను ప్రజల దగ్గరికి చేర్చే అవకాశం ఇచ్చింది అని కొనియాడారు. జవిద్ మాట్లాడుతూ అల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ అనే సంస్థ జాతీయ సంస్థ అని ,ఈ సంస్థ ఆశయం వంద శాతం విద్యను ప్రజలందరికీ మతాలకు అతీతంగా అందజేయడం ప్రధాన లక్ష్యం అని తెలిపారు. మిల్లీ కౌన్సిల్ ద్వారా విద్యార్ధులకు నీట్ ,జెఇఇ ,మరియు సివిల్స్ కు సంబందించిన కౌచింగ్ ఉచితంగా ఇస్తూ మెరిట్ సాధించిన విద్యార్ధులకు ఉచితంగా చదివించే పని కూడా చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్ మద త్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమళ్ళ రహీమ్ ,మిల్లీ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ అసదుల్ల ,ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక నంద్యాల మండల ప్రధాన కార్యదర్శి శివ నారాయణ,ఉపాధ్యక్షుడు ఆరిఫ్ ,నంద్యాల టౌన్ కోశాధికారి సయ్యద్ మౌలాలి ఆల్ మిడియో సెంటర్ ఇంచర్జ్ రహంతుల్లా ,ఫ్యాకల్టీ అబ్దుల్ మజీద్, మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## కార్మిక, ప్రజా వ్యతిరేక మోడీ బడ్జెట్ ను తిరస్కరించండి

బద్వేలు ప్రజా సంఘాల ఐక్యవేదిక బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సుందరయ్య భవనం నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక పట్టణ కన్వీనర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ..2023-2024 ఆర్థిక సంవత్సరానికి బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రైతులకు, కార్మికులకు, శ్రమజీవులకు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని, దేశంలో ఉన్న నిరుద్యోగాన్ని పోగొట్టడానికి కానీ, పెరుగుతున్న ధరలను తగ్గించడానికి గాని, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి గానీ ఈ బడ్జెట్ సహాయపడదని కేవలం ప్రైవేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్న ఈ బడ్జెట్ ను తిరస్కరించాలని ప్రజాసంఘాల ఐక్యవేదికగా డిమాండ్ చేశారు. కార్మికుల కోర్కెలను ఈ బడ్జెట్ ఎటువంటి పరిష్కారం చూపలేదు కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ విద్యా మిషన్, జాతీయ జీవనోపాదుల మిషన్ లకు మోడీ ప్రభుత్వం కేటాయింపులు పెంచలేదని ఆకలి సూచికలో వెనుక పడడం, పోషకాహార లోపం తదితరాలతో బాధపడుతున్న ప్రజానీకానికి ఈబడ్జెట్లో ఎటువంటి రక్షణ లేదు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు గణనీయంగా పెంచి ,పని దినాలను 200 రోజులకు పెంచాలని ,రోజు వేతనం 600 రూపాయలు చేయాలని, పథకాన్ని పట్టణాలలో కూడా అమలు చేయాలని కోరుతుండగా కేంద్ర ప్రభుత్వం ఇదేమి పట్టించుకోకుండా గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్రంగా కోత పెట్టింది. అసంఘటితరంగ సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయించి, సంక్షేమ పథకాలను కార్మికులందరికీ అమలు చేయాలన్న కోర్కెను కూడా బడ్జెట్ పట్టించుకోలేదు. ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ చెల్లించలని లక్షలాదిమంది వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్స్ చేస్తున్న ఆందోళన కూడా మోడీ చెవికి ఎక్కలేదని, పెన్షనర్లకు ఎటువంటి కేటాయింపులు చేయలేదని, మోడీ ప్రభుత్వం తన తీరుకు తగ్గట్టుగా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను కొనసాగిస్తుందని, ఈ బడ్జెట్ లో కూడా 61 వేల కోట్ల రూపాయల మేర ప్రభుత్వరంగ సంస్థలను అమ్మాలని ప్రతిపాదించింది. నగరాలు, పట్టణాల మౌలిక సౌకర్యాల అభివృద్ధికి నిధులు కేటాయించిన ప్రభుత్వం ఆ సౌకర్యాలను అందుకోవాలంటే ప్రజలు యూజర్ ఛార్జీలు చెల్లించాలని మెలిక పెట్టింది. ఫైనాన్షియల్ రంగంలో మరిన్ని సంస్కారాలను ప్రతిపాదించింది. బ్యాంకింగ్ రెగ్యులైజేషన్ చట్టం, బ్యాంకింగ్ కంపెనీల చట్టం మరియు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాలకు సవరణలు చేస్తామని చెప్పింది. ఇప్పటికే ప్రభుత్వరంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం పూనుకుంటుంది. మరిన్ని ప్రజా వ్యతిరేక సంస్కరణలు రాబోతున్నట్లుగా బడ్జెట్ ఉపన్యాసంలో ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న వ్యవసాయ పరపతి సహకార రంగాన్ని కేంద్ర ప్రభుత్వం కైంకర్యం చేస్తుంది. మోడల్ బైలాస్ ను ప్రతిపాదించింది. రోడ్లు, రైళ్లు, విద్యుత్తు, టూరిజం తదితర రంగాల్లోకి ప్రైవేట్ పెట్టుబడులను అనుమతించింది. దేశ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి దిగజారిందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరింత దిగజారుతుందని ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే స్పష్టం చేసిందని అయినప్పటికీ బడ్జెట్ ప్రసంగంలో ప్రపంచం తమ విజయాలను చూసి మెచ్చుకున్నట్లుగా బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు.

## కేంద్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక బడ్జెట్ కు వ్యతిరేకంగా నిరసన. ...

రైతు సంఘం




కౌతలమ్ : మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పోరేటర్లకు అనుకూలంగా, రైతులకు వ్యతిరేకంగా ఉందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య అన్నారు. బిజెపి ప్రభుత్వము ఎన్నికల సందర్భంగా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, రైతుకు మద్దతు ధర ప్రకటిస్తామని, రైతులకు హామీ ఇచ్చి బడ్జెట్లో ప్రస్తావించకపోవడం విచారకరం. ప్రధానమంత్రి సమ్మన్ నిధికి నిధులు తగ్గించారు. రైతుల నుండి ధాన్యాన్ని సేకరించి ఆహార భద్రతకు తోడ్పడే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నిధులు తగ్గించారు. గ్రామీణ ఉపాధికి నిధులు తగ్గించారు. ధరలు పెరగడానికి దోహదం చేసినారు. విద్యుత్ ప్రైవేట్ గురించి ఏమి ప్రస్తావన రాలేదు. అందుకు ఈ బడ్జెట్ రైతులకు వ్యతిరేకంగా ఉన్నందుకు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్నాం. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మేలిగిరి ఈరన్న, రైతు సంఘం నాయకులు నాగరాజు, తిక్కయ్య, వన్నూరప్ప, హనుమంతు ,బసవ ,వలి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతి రుయా ఆసుపత్రిలో శిశువు మృతదేహం

తిరుపతి తిరుపలి రుయా ఆసుపత్రిలో శిశువు మృతదేహం లభ్యమయింది. రెండు రోజుల పురిటి బిడ్డను చంపి పడవేశారా...లేదా మృతి చెందాక ఆసుపత్రి ప్రాంతంలో వదిలి వెళ్ళారా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. పురిటి బిడ్డ మృతదేహం వద్ద లభించిన చీటీ ఆధారంగా ఫోన్లో సంప్రదిస్తే అవుట్ ఆఫ్ ఆర్డర్ వస్తుంది. శిశువు మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు.


### అంబేద్కర్ స్మృతివనం పనులు వేగవంతం

విజయవాడ :సీఎం జగన్ ఆదేశాల మేరకు స్వరాజ్య మైదానంలో అంబేద్కర్ స్మృతివనం పనులు మరింత వేగవంతం అయ్యాయి. గురువారం నాడు రాష్ట్ర మున్సిపల్ శాఖ స్పెషల్ సీఎస్.వై శ్రీలక్ష్మి అంబేద్కర్ స్మృతివనం పనులు పరిశీలించారు. శ్రీ లక్ష్మితో పాటు ఏపీ.ఐ.ఐ.సీ, వి.సిఎం.డి, సృజన, నగర మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ పుండ్కర్ పలువురు అధికారులు,ఇంజనీర్లు పాల్గొన్నారు. 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనం పనుల నాణ్యత పై శ్రీలక్ష్మి ఆరా తీసారు. నాణ్యతా, ప్రమాణాలపై కాంట్రాక్టర్ల కు సూచనలు ఇచ్చారు. అంబేద్కర్ స్మృతివనం నిర్మాణ వ్యయం 286 కోట్లు. 2000 మంది సామర్థ్యం తో ఆడిటోరియం. 500 మంది సామర్థ్యంతో ఓపెన్ థియేటర్, ధ్యాన మందిరం ఏర్పాటు చేస్తున్నారు.


## సుమలో ఈ యాంగిల్ కూడా ఉందా?



టీవీ షోలలో కంటెంట్ వీక్ అయినా తనదైన స్పాంటేనిటీ.. కామిక్ టైమింగ్.. పంచ్ లతో షోని రక్తి కట్టించగల ఏకైక యాంకర్ ఎవరైనా ఉన్నారా? అంటే అది సుమ మాత్రమే. బోర్ కొట్టే కార్యక్రమాలతోను రంజింపజేసే ప్రతిభ తన సొంతం. ప్రస్తుతం ఏ స్టార్ హీరో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కైనా సుమ మొదటి ఛాయిస్ అనడంలో సందేహం లేదు. అసలు సుమ తేదీలు అందుబాటులో లేకపోతే సూపర్ స్టార్లు కూడా తమ ప్రీ-రిలీజ్ ఈవెంట్ లను వాయిదా వేసుకున్న సందర్భాలున్నాయి. మూడు లేదా నాలుగు భాషల్లో అనర్గళంగా మాట్లాడగల సామర్థ్యం కూడా ఇతర యాంకర్ల తో పోలిస్తే సుమలో ఉన్న అసాధారణ ప్రతిభకు నిదర్శనం.సుమ కనకాల సీరియల్ నటిగా తన నటనా జీవితాన్ని ప్రారంభించారు.. ఆమె తన అద్భుతమైన ప్రతిభతో యాంకర్ గా స్టార్ గా ఎదిగారు. తాను ఎంచుకున్న రంగంలో ఎలా విజయం సాధించాలో నిరూపించి తర్వాతి తరానికి రోల్ మోడల్ గా నిలిచారు. ఈ క్రమంలో ఆమె దాదాపు 15 ఏళ్ల పాటు ఈటీవీ షో 'స్టార్ మహిళ'కి యాంకర్ గా వ్యవహరిస్తూ రికార్డు సృష్టించింది. తన ఇటీవలి షోలో యాంకర్ గా తన సుదీర్ఘ కెరీర్ కు విరామం ఇస్తున్నట్లు ప్రకటించింది. డిసెంబర్ 31న ప్రసారం కానున్న ఈటీవీ 'వేర్ ఈజ్ ది పార్టీ ప్రోమో' చివర్లో ఈ షాకింగ్ న్యూస్ వెల్లడైంది.ఆమె పట్టుకుంటే పట్టు చీర- భలే ఛాన్స్ లే- ఉమ్మని మహారాణులు వంటి అనేక లేడీస్ షోలను సంవత్సరాల తరబడి బోర్ కొట్టకుండా నడిపింది. పాడుతా తీయగా- స్వరాభిషేకం వంటి ప్రముఖ షోలకు యాంకర్ గా వ్యవహరించింది. కొన్ని సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా కనిపించింది. ఇటీవల 'జయమ్మ పంచాయితీ' చిత్రంలో కథానాయికగా నటించింది. అయితే ప్రస్తుతం 47 ఏళ్ల వయసులో ఉన్న సుమ యాంకరింగ్ నుంచి రిటైర్ కావాలని కోరుకుంటోందని కథనాలొచ్చాయి.గత ఇరవై ఏళ్లుగా నాన్ స్టాప్ గా పనిచేయడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. నిత్యం మాట్లాడుతుండడంతో గతంలో ఆమెకు గొంతు ఆపరేషన్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కాస్త విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నారని తెలిసింది.తెలుగువారు చూపుతున్న అభిమానం ప్రేమ వల్లనే నేను మలయాళీగా ఇక్కడ స్థిరపడ్డాను. లేకపోతే.. నేను ఉండను. దాన్ని నోట్ చేసుకోండి. అయితే నేను కొన్నాళ్ల పాటు విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాను అని ఆమె ఏడుస్తూ చెప్పారు. అయితే సినిమా ఫంక్షన్లు - ప్రచార ఇంటర్వ్యూలను యథావిధిగా కొనసాగిస్తున్నారు.సుమ గురించి అంతగా తెలియని ఒక గొప్ప విషయం ఉంది. తానొక గొప్ప సామాజిక కర్త. నిస్సహాయంగా ఉన్నవారిని ఆదుకునే మంచి తత్వం ఉంది. ఇంతకుముందే తాను 30 మంది విద్యార్థులను దత్తత తీసుకున్నట్లు ప్రకటించిన సుమ.. వాళ్ల పూర్తి బాధ్యతలను తానే చూసుకుంటున్నానని వెల్లడించారు. ఇటీవల చెన్నై కాలేజీలో జరిగిన ఓ కార్యక్రమంలో దీని గురించి పూర్తి వివరాలు వెల్లడించారు. టీచర్ అవుదామనుకుని యాంకర్ అయ్యానని ఈరోజు ఈ వృత్తిలో కొనసాగుతున్నానంటే దానికి కారణం మా అమ్మ అని సుమ తెలిపారు. ఆమె తెలుగు నేర్చుకొని నాకు నేర్పించింది. ఇందులో కొనసాగడానికి కూడా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని చెప్పిన సుమ సమాజానికి తనవంతు సేవ చేస్తున్నానని వెల్లడించారు.సామాజిక సేవలో భాగంగా 'ఫెస్టివల్ ఫర్ జాయ్' అనే సంస్థను ప్రారంభించామని కూడా తెలిపారు. 30 మంది విద్యార్థులను దత్తత తీసుకుని వారిని చదివించే బాధ్యతలతో పాటు అన్ని బాధ్యతలు స్వీకరించినట్టు వెల్లడించారు. విద్యార్థులంతా జీవితంలో స్థిరపడే వరకు సహాయం చేస్తుంటామని తెలిపారు. ఇది తెలిసాక అభిమానులు మనసున్న యాంకర్ అని ప్రశంసలు కురిపిస్తున్నారు. మంచి పని చేస్తున్నావని ప్రోత్సహిస్తున్నారు. మునుముందు సుమ సామాజిక కార్యక్రమాలను విస్తరించాలని కోరుకుంటున్నారు.




## శ్రద్ధా దాస్.. ఆ నడుము నయాగారా ఫాల్స్



బోల్డ్ బ్యూటీ శ్రద్ధా దాస్ గ్లామర్ షోలో ఎప్పుడో బౌండరీలు బ్రేక్ చేసేసింది. ఎంత మంది స్టార్ హీరోయిన్లు ఈ గ్లామర్ ట్రీట్ వడ్డించినా శ్రద్ధాను మించిన హాట్ నెస్ ఎవరికీ సాధ్యం కాదేమో. ఎప్పటికప్పుడు కొత్త అవుట్ ఫిట్లు చీరలు ధరించి.. ఎద అందాలతో పాటు నాభి అందాలను నడుము మడతలను చూపిస్తుంటుంది. బిగువైన టాప్ అందాలతో రెచ్చిపోతుంటుంది. దీంతో ఎప్పటికప్పుడు ఆమె నయా గ్లామర్ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంటాయి.వీటిని చూస్తే హాట్ పిక్స్కి నెక్ట్స్ వెర్షన్ అనే చెప్పాలి. ఎందుకంటే ఆమె ఏమీ దాచుకోకుండా అందాలన్నీ చూపిస్తూ కుర్రాళ్లలో హీట్ పెంచేస్తూ ఉంటుంది. తాజాగా ఈ మధ్యలో మరి కొన్ని హాట్ పిక్స్ను షేర్ చేసింది. ఒక దాంట్లో ఉప్పొంగే ఎద అందాలను చూపిస్తూ కవ్వించింది. మరో దాంట్లో మడతలు పడిన నడుమును చూపించింది. అవి చూసిన నెటిజన్లు ఇక ఆగుతారా... హైదరాబాద్ ఓఆర్ఆర్ సెక్సీ నడుము రా బాబోయ్ సెక్సీ హాట్ మై డియర్ బ్యూటీ అటూ హాట్ కామెంట్స్ పెడుతున్నారు.ఇక ఈ సినిమా కెరీర్ విషయానికొస్తే.. అల్లరి నరేష్తో సిద్దు ఫ్రమ్ సీకాకుళం చిత్రంతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన శ్రద్ధా దాస్... తొలి చిత్రంతోనే మెప్పించింది. మంచి విజయాన్ని అందుకుంది. అల్లరి నరేష్తో కలిసి ఇందులో శ్రద్ధా చేసిన రచ్చ అంతా ఇంతా కాదు.గ్లామర్కి కొత్త టచ్ ఇవ్వడంతో ఆడియెన్స్ తెగ ఆరాటపడి ఎగబడి చూశారు. దీంతో ఒక్కసారిగా పాపులర్ అయిపోయింది శ్రద్ధాదాస్. దీంతో వరుస ఆఫర్లను అందుకుంది. అయితే ఈ బ్యూటీకి హీరోయిన్గా కాకుండా సెకండ్ హీరోయిన్ రోల్ ఆఫర్స్ కూడా వచ్చాయి. దీనికి తోడు అవి బోల్డ్ గ్లామరస్ పాత్రలే అవ్వడంతో హీరోయిన్ గా అవకాశాలు తగ్గిపోయాయి.అప్పటికే ఆమె ప్రభాస్ డార్లింగ్ అల్లుఅర్జున్ ఆర్య 2 ఇలా ఎన్నో పాత్రలతో గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత స్పెషల్ రోల్స్ స్పెషల్ సాంగ్లకు పరిమితమైంది. ప్రస్తుతం అడపాదడపా చిత్రాలు చేస్తున్న ఈ బ్యూటీ.. 'ఢీ' డ్యాన్స్ షోకు జడ్జా వ్యవహరిస్తోంది. ఈ షోతో మరింత పాపులారిటీని సొంతం చేసుకుంది.

## రొనాల్డో అరుదైన రికార్డు బద్దలు కొట్టిన మెస్సీ.. ఇక చాలు!




క్రిస్టియానో రొనాల్డో- లియోనల్ మెస్సీ.. ఈ ఇద్దరు ఫుట్‌బాల్ దిగ్గజాల మధ్య రికార్డుల పోటీ నువ్వా- నేనా అన్నట్లుగా ఉంటుందన్న సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.దశాబ్దకాలంగా సాకర్ ప్రపంచంలో తమదైన ముద్ర వేస్తున్న ఈ ఇద్దరు లెజెండ్స్‌లో.. మెస్సీ ఫిఫా ప్రపంచకప్-2022 ట్రోఫీని ముద్దాడి ఓ మెట్టు పైన నిలిచాడు.మరోవైపు.. పోర్చుగల్ స్టార్ రొనాల్డోకు మాత్రం వరల్డ్‌కప్ టైటిల్ అందని ద్రాక్షగా మిగిలిపోయింది. ఖతర్ టోర్నీలో అర్జెంటీనా సూపర్‌స్టార్ మెస్సీ అద్భుతాలు చేయగా..రొనాల్డో మాత్రం అవమానకర రీతిలోఈవెంట్ నుంచి నిష్క్రమించాల్సిన పరిస్థితి తలెత్తిన విషయం తెలిసిందే.రొనాల్డో రికార్డు బద్దలుఈ క్రమంలో రొనాల్డోకు సాధ్యం కానిపలు రికార్డులు తన ఖాతాలో వేసుకున్న లియోనల్ మెస్సీ.. ఈ పోర్చుగల్ స్టార్ పేరిట ఉన్న మరో రికార్డును బద్దలు కొట్టాడు. టాప్-5 యూరోపియన్ లీగ్‌లలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. మొత్తంగా 697 గోల్స్‌తో రొనాల్డోను అధిగమించాడు మెస్సీ.ఫ్రెంచ్ లీగ్‌లో భాగంగా పారిస్ సెయింట్ జర్మనీ(పీఎస్‌జీ), మాంట్‌పిల్లర్ మ్యాచ్ సందర్భంగా మెస్సీ ఈ ఫీట్ నమోదు చేశాడు. పీఎస్‌జీకి ప్రాతినిథ్యం వహించిన ఈ అర్జెంటీనా లెజెండ్.. ఈ మ్యాచ్‌లో గోల్ ద్వారా రొనాల్డోను వెనక్కినెట్టాడు. క్లబ్ కెరీర్‌లో మొత్తంగా 697 గోల్స్ చేసి టాప్‌లో నిలిచాడు. ఇక ఇందులో ఈ సీజన్‌లో పీఎస్‌జీ తరఫున చేసిన గోల్స్ 13.మరోవైపు.. రొనాల్డో ఇప్పటి వరకు రియల్ మాడ్రిడ్ తరఫున 450, మాంచెస్టర్ యునైటెడ్ తరఫున 145, జువెంటస్ తరఫున 101 గోల్స్‌తో కలిపి మొత్తంగా 696 గోల్స్ సాధించాడు. ఇదిలా ఉంటే.. మాంట్‌పిల్లర్‌తో మ్యాచ్‌కు ముందు మెస్సీ మాట్లాడుతూ తన రిటైర్మెంట్‌పై సంకేతాలు ఇచ్చాడు.కోరుకున్నవన్నీ దక్కాయి.. ఇకపై"జాతీయ జట్టు తరఫున నేనైతే సాధించాలని అనుకున్నానో ఆ కల నెరవేరింది. వ్యక్తిగతంగా.. వృత్తిగతంగా నేను కోరుకున్నవన్నీ నాకు లభించాయి. శిఖరాగ్రంలో ఉన్నపుడే కెరీర్‌ను ముగించడమే మిగిలి ఉంది. నేను ఫుట్‌బాల్ ఆడటం మొదలుపెట్టినపుడు ఇక్కడి దాకా వస్తానని అస్సలు ఊహించలేదు.కెరీర్‌లో అత్యుత్తమ స్థాయికి చేరుకున్నాను. ప్రస్తుతం నా జీవితంలో ఎలాంటి అసంతృప్తి లేదు. మేము 2021లో కోపా అమెరికా, 2022లో వరల్డ్‌కప్ గెలిచాము. ఇంతకంటే సాధించాల్సిందేమీ లేదు"అని మెస్సీ అర్బన్‌ప్లేతో వ్యాఖ్యానించాడు. ఇదిలా ఉంటే రొనాల్డో ప్రస్తుతం సౌదీ అరేబియా ఫుట్‌బాల్ క్లబ్ అల్ నసర్ మ్యాచ్‌లతో బిజీగా ఉన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190